● విశాఖ-చెన్నై రైలు మార్గంలోని అన్నవరం నుంచి కాకినాడ తీరంలో కొత్తగా నిర్మించబోయే గ్రీన్ ఫీల్డ్ పోర్టు-కాకినాడ పోర్టు-కోటిపల్లి-నరసాపురం-మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం పోర్టులను కలుపుతూ బాపట్ల వరకు జాతీయ రహదారి-216కు అనుబంధంగా కోస్తా రైలు మార్గం నిర్మించాలి. **-దశాబ్దకాలంగా కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం విన్నపం**

● నరసాపురం-మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల మధ్య కొత్త రైల్వేలైన్ మంజూరు చేయండి. ఈ లింక్‌ను బాపట్ల దగ్గర కోల్‌కత్తా-చెన్నైలతో అనుసంధానం చేయండి. **-దిల్లీ పర్యటనలో కేంద్ర రైల్వే మంత్రిని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



కోస్తా రైలు మార్గంపై కోటి ఆశలు

సాకారమైతే సౌలభ్యమిదే..

ఈనాడు, కాకినాడ

వ్యవసాయ, పారిశ్రామిక, నౌకా వాణిజ్యం, పెట్రోలియం-గ్యాస్ నిక్షేపాలు, సముద్ర-నదీ మత్స్య ఉత్పత్తులకు కోస్తా తీరంలో కొదవే లేదు. సుదీర్ఘ సాగర తీరం.. గోదావరి-కృష్ణా నదీ పరివాహకం.. ఈ ప్రాంతాన్ని కలుపుతూ కోస్తా రైలు మార్గాన్ని నిర్మిస్తే రాకపోకలకు సౌలభ్యం కలుగుతుంది. పారిశ్రామిక-వాణిజ్య రంగాలకూ ఊతమిచ్చినట్లు అవుతుందన్నది దశాబ్దకాలంగా వినిపిస్తున్న వాదన. తాజాగా దిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రైలు మార్గం మంజూరు చేయాలని కేంద్ర రైల్వే మంత్రిని కలిసి కోరడం.. సానుకూల స్పందన రావడంతో ప్రాజెక్టు సాకారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయనే మాట వినిపిస్తోంది.



▮ కాకినాడ నగరానికి ప్రధాన రైలు మార్గం అనుసంధానం కాలేదు. దీంతో ఇటు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు.. లేదంటే రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోంది. మార్గం సాకారమైతే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

▮ చెన్నై-విశాఖ ప్రధాన రైలు మార్గానికి ఇది ప్రత్యామ్నాయ రైలు మార్గంగా మారుతుంది. 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలకూ సౌలభ్యంగా ఉంటుంది.

▮ గోదావరి, కృష్ణా నదుల మధ్య కోనసీమ, దివిసీమ లాంటి ప్రాంతాలకు రైలు మార్గం ఏర్పాటు ద్వారా సుందర ప్రదేశాలను కలుపుతూ పర్యాటకంగా అభివృద్ధికి వీలుంది.

▮ అన్నవరం నుంచి గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. గతంలోనే కాకినాడ-కోటిపల్లి రైలు మార్గం నిర్మించారు. కోటిపల్లి-నరసాపురం రైలు మార్గం పనులు సాగుతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నుంచి కాకినాడ-నరసాపురం నుంచి మచిలీపట్నం-రేపల్లె, నిజాంపట్నం మీదుగా బాపట్ల వరకు 100 కి.మీ పైగా రైలు మార్గం నిర్మిస్తే సరిపోతుంది.

▮ కోటిపల్లి-నరసాపురం రైలు మార్గం నిర్మాణంలో భాగంగా గోదావరి ప్రాంతంలోని నదులపై వంతెనల నిర్మాణం సాగుతోంది. మిగిలింది కృష్ణా నదిపై వంతెన నిర్మాణమే. తక్కువ ఖర్చుతో ఈ మార్గం పూర్తిచేయవచ్చు.

ఉమ్మడి గోదావరి-కృష్ణా జిల్లాలకు మేలు

కోస్తా రైలు మార్గం కోసం పదేళ్లకుపైగా పోరాడుతున్నాం. మా డిమాండ్‌ను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లినందుకు ధన్యవాదాలు. ప్రధాన రైలు మార్గానికి ప్రత్యామ్నాయంగా.. నాలుగు పోర్టులు, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలను కలుపుతూ మార్గం ఏర్పాటైతే ఈ ప్రాంతీయుల రాకపోకలకు సౌలభ్యంతోపాటు.. పారిశ్రామిక, వాణిజ్యరంగాలకూ ఊతమిచ్చినట్లువుతుంది.

- వైడీ రామారావు, దక్షిణ మధ్య రైల్వే జోనల్ వినియోగదారుల సలహా సంఘం సభ్యులు

టెట్‌కు 1186 మంది హాజరు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలో సోమవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 1186 మంది హాజరయ్యారు. నాలుగు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు మొత్తం 1335 మంది హాజరు కావాల్సి ఉండగా 149 మంది గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లోనూ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో పి.రమేష్ తెలిపారు.



పెరుమాళ్లపురం సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు

తీరంలో అలజడి

భారీ వర్ష సూచనతో యంత్రాంగం అప్రమత్తం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఈనెల 16 వరకు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అన్ని శాఖలు సహాయక చర్యలకు సమాయత్తం కావాలని సూచించింది. దీంతో యంత్రాంగం అప్రమత్తమైంది.

జిల్లాకు భారీ వర్షసూచన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అన్ని శాఖలను అప్రమత్తం చేసినా, జిల్లా రెవెన్యూ శాఖలో మాత్రం కదలిక లేదు. విద్యుత్తు, పురపాలక, తదితర శాఖలు సహాయక చర్యలకు సన్నద్ధమవుతున్నా.. కీలకమైన రెవెన్యూశాఖలో మాత్రం కదలిక లేదు.

విద్యుత్తు శాఖకు సంబంధించి..

విద్యుత్తుశాఖ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా విద్యుత్తు లైన్లపై చెట్లు, కొమ్మలు పడినా, తీగలు కిందకు వేలాడినా, స్తంభాలు బాగా ఒరిగిపోయినా ప్రజలు వెంటనే కంట్రోల్ రూంలకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

కాకినాడ
94931 78718
పెద్దాపురం
94931 78728
జగ్గంపేట - 94906 10096, 08852-233575

ఫుల్ జోష్

413 మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ పూర్తి



కలెక్టరేట్ వద్ద దరఖాస్తుదారుల కోలాహలం

ఈనాడు, కాకినాడ -న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద, తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఈ ప్రక్రియ సాగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 413 దుకాణాలకు లాటరీ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తిచేసింది. లాటరీ సందర్భంగా ఆయా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే సందడి కనిపించింది. ఉదయం 8 గంటలకు ప్రారంభించిన లాటరీ ప్రక్రియ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మధ్యాహ్నానికే ముగిస్తే.. తూర్పుగోదావరి జిల్లాలో సాయంత్రం వరకు సాగింది. ఎక్కడా ఎలాంటి అనుమానాలు, వివాదాలకు తావివ్వకుండా.. లక్కీడ్రా ప్రక్రియ మొత్తం కలెక్టర్లు వీడియో దృశ్యాలు చిత్రీకరించారు. జిల్లాల వారీగా గెజిట్‌లో ప్రచురించిన దుకాణాల క్రమ సంఖ్య ప్రకారం లాటరీ తీశారు. అధికారులు ఒకటికి రెండుసార్లు పేర్లు, టోకెన్ నంబర్లు మైక్‌లో చెబుతూ దరఖాస్తు చేసుకున్న వారి సమక్షంలో డ్రా తీశారు.

ఎంపిక ఇలా..

లక్కీడ్రాలో దుకాణం దక్కించుకున్న విజేతను.. సక్సెస్‌ఫుల్ క్యాండిడేట్ అని.. ఆ తర్వాత వచ్చిన రెండు టోకెన్లను రిజర్వుడు 1, 2 కింద ఎంపిక చేశారు. లక్కీడ్రాలో విజేత సొమ్ము చెల్లించి, లైసెన్సు పొందకపోతే.. మిగిలిన ఇద్దరికి ప్రాధాన్య క్రమంలో అవకాశం దక్కుతుంది



లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, అధికారులు



లాటరీ ప్రక్రియకు హాజరైన మహిళలు

మహిళల ఆసక్తి

మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి పలువురు మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. వీరి పేరుతో కలిసొస్తుందని పలువురు భార్య, కుమార్తె, ఇతర మహిళా కుటుంబీకుల పేర్లతో దరఖాస్తు చేశారు. రాజమహేంద్రవరంలో 250 మందికిపైగా వనితలు దరఖాస్తు చేయడం గమనార్హం. జిల్లాల వారీగా కాకినాడలో 10, కోనసీమలో 11, తూర్పుగోదావరి జిల్లాలో 12 మద్యం దుకాణాలు మహిళలకు దక్కాయి.

జిల్లాలో 155 మందికి..

జిల్లాలోని దాఖలైన 3,332 దరఖాస్తులను డ్రా తీసి 155 మందికి దుకాణాలు కేటాయించారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ విభాగం గ్రౌండ్ ఫ్లోర్‌లో కాకినాడ, పిఠాపురం పరిధిలోని దుకాణాల దరఖాస్తులు లాటరీ తీయగా.. ఫస్ట్ ఫ్లోర్‌లో పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, తాళ్లరేవు మండలాల పరిధిలోని మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ సాగింది. కలెక్టర్ షాన్ మోహన్ పర్యవేక్షణలో జేసీ రాహుల్ మీనా, ఎక్సైజ్ అదనపు కమిషనర్ రేణుక, ఈఎస్ కృష్ణకుమారి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా అబ్కారీ శాఖ డీసీ చైతన్యమురళి లాటరీ ప్రక్రియను పరిశీలించి సిబ్బంది సూచనలు చేశారు.

☛ తుని పరిధిలోని రెండు దుకాణాలకు దయాన శ్రీనివాస్, దయాన సావిత్రి తరపున తొమ్మిది చొప్పున దరఖాస్తు చేసుకోగా లక్కీడ్రాలో వీరికి దుకాణాలు దక్కాయి.

☛ జిల్లాలో కొన్నిచోట్ల అంతా కూడబలుక్కుని దరఖాస్తు చేయడంతో వివాదాలకు ఆస్కారం లేకుండా పోయింది.

ఊరూరా ఉత్సవమే..

'పల్లె పండగ' ప్రారంభం



శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు

కొత్తపల్లి: పల్లె పండగకు అడుగుపడింది. అయిదేళ్ల తర్వాత ఊరూరా ఆనందం వెల్లివిరిసింది. కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాలు.. జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. పలుచోట్ల కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యు.కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్ల నిధులతో మాయాపట్నం కాలనీ మొత్తం రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం సంతోషకరమని ఎంపీ అన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ ఈ కాలనీలో వైకాపా అయిదేళ్ల పాలనలో గంపెడు మట్టికూడా వేయలేదన్నారు. జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, కూటమి నాయకులు జ్యోతుల శ్రీనివాస్, అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్తికం.. సత్యదేవుడి సన్నిధిలో సన్నద్ధం

అన్నవరం, న్యూస్‌టుడే: రానున్న కార్తిక మాసంలో భక్తుల రద్దీ నేపథ్యంలో చురుగ్గా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులను ఈవో కె. రామచంద్రమోహన్ ఆదేశించారు. అదనపు వ్రత మండపాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. వసతి గదుల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. దర్శనాలు, వ్రతాల నిర్వహణ, ట్రాఫిక్, వసతి, భద్రత తదితర అన్ని అంశాలపై చర్చించి ఏర్పాట్లను ఈ నెల 22 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ, పర్వదినాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈ నెల 19న సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.



మండపీత.. ధరమోత!

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ చేపలరేవులో సోమవారం ఓ మత్స్యకారుడికి మండపీత చిక్కింది. సుమారు కిలోన్నర బరువు, భారీ కాళ్లున్న దీనికి రేవులో వేలం నిర్వహించగా రూ.1500కి విక్రయమైంది. ఈ జాతికి చెందిన పీతలు చాలా అరుదుగా లభిస్తాయని, దీనికి డిమాండ్ ఉంటుందని, వలకు చిక్కి ఒక కోర ఊడిపోయిందని, లేదంటే రూ.3000 వరకు ధర పలికేదని మత్స్యకారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, కొత్తపల్లి**

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

● అక్రమార్కులకు కాసుల వర్షం..
● చోద్యం చూస్తున్న అధికారగణం

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏలేరు ప్రధాన కాలువలో ఇసుక అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఇసుక తవ్వకాల కోసం ఏకంగా ప్రధాన కాలువ మధ్య రోడ్డు వేశారు. అది కూడా ప్రధాన సాగునీటి నిర్మాణాలకు సమీపంలోనే ఈ తంతు సాగుతోంది. ఇంత పెద్ద ఎత్తున ఇసుక లూటీ జరుగుతున్నా, లారీలు, ట్రాక్టర్లపై తరలిస్తున్నా అధికారులు మౌనముద్రదాల్చడం విమర్శలకు తావిస్తోంది. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం, ఎస్.తిమ్మాపురం గ్రామాల మధ్య ఏలేరు ప్రధాన కాలువలో అక్రమ దందా ఇదీ. దీంతో పాటు ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లో ప్రధాన ఏటి వెంబడి పలు ప్రాంతాల్లో రోజూ వందల ట్రాక్టర్ల ఇసుక తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.



కృష్ణవరంలో ఏలేరు ప్రధాన కాలువలోకి బాట ఏర్పాటు..

లారీలు, ట్రాక్టర్లతో..

ఏలేరు ప్రధాన కాలువలో కృష్ణవరం గ్రామంలో పొక్లెయిన్లతో ఇసుక తవ్వి కొండలను తలపించే ఇసుక గుట్టలు పెడుతున్నారు. ట్రాక్టరు ఇసుక స్థానికంగా అయితే రూ.ఐదు వేలు, దూరప్రాంతాలకు ఆరు వేల ఎనిమిది వేల వరకు అమ్ముతున్నారు. అదే లారీ అయితే గుట్టవద్ద రూ.20 వేలు పైనే ఉంది. జగ్గంపేట మండలం మామిడాడ మొదలుకొని కిర్లంపూడి మండలం గోనేడ వరకు ఏడ్లబళ్లపై ఒడ్డుకు తెచ్చి ట్రాక్టర్లపై నింపుతున్నారు.

ప్రధాన కాలువకు అడ్డుగా రోడ్డు

కృష్ణవరం గ్రామశివారు తోటల్లోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ఎస్.తిమ్మాపురంలోని కిర్లంపూడి బైపాస్ రెగ్యులేటరుకు సమీపంలో పొక్లెయిన్లతో తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో రూ.కోట్లతో నిర్మించిన సాగునీటి నిర్మాణాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం

ఇసుక తవ్వకాలపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నాం. కృష్ణవరంలో పెద్ద ఎత్తున ప్రధాన కాలువలో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నట్లు మాదృష్టికి రాలేదు. దీనిపై సిబ్బందిని పంపించి పరిశీలన చేయిస్తాం. ప్రధాన కాలువలో ఇసుక తవ్వకాలు సాగిస్తే ఎవరిని ఉపేక్షించం.

-జె.చిరంజీవి, తహసీల్దారు, కిర్లంపూడి

సాగునీటి నిర్మాణాలకు ముప్పు..

ఏలేరు కాలువల్లో ఇసుక తవ్వకాలతో సాగునీటి నిర్మాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పెద్ద గోతులు పెట్టడంతో ఇసుక గోతుల్లోకి కొట్టుకుపోయి సాగునీటి నిర్మాణాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీనికి ఉదాహరణ తిరుమాలి గ్రోయిన్. అందువల్ల ఏలేరులో ఇసుక తవ్వకుండా ఉండడమే ఉత్తమం. ఏలేరులో ఎక్కడ ఇసుక తవ్వినా చర్యలు తీసుకుంటాం.

- శేషగిరిరావు, ఇన్‌చార్జి ఈఈ

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 50 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

మసీదుసెంటర్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 50 మంది నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కోటనందూరు స్టేషన్‌లో తనిఖీలు

తుని గ్రామీణం (కోటనందూరు): కోటనందూరు పోలీసుస్టేషన్‌నులో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సోమవారం తనిఖీలు చేశారు. దస్త్రాలు పరిశీలించిన ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. సమస్యలతో వచ్చేవారితో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై రామకృష్ణ, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వీధికుక్కల సమస్యకు పరిష్కారం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని స్థానిక సంస్థల్లో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి, వాటి సంతతిని తగ్గించే చర్యల్లో భాగంగా సంతానోత్పత్తి నివారణకు కు.ని.శస్త్రచికిత్సలు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. సోమవారం నగరపాలకసంస్థ కమిషనర్ భావన, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.సూర్యప్రకాశరావుతో కలిసి కలెక్టరేట్ నుంచి ఆయన నగరపాలక, పురపాలక, నగర పంచాయతీల్లో గ్రామసింహాలకు శస్త్రచికిత్సలు చేయాల్సిన తీరుతో పాటు ఉద్యోగుల బదిలీలు, ఖాళీ పోస్టుల వివరాలపై మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తరుచుగా పట్టణాల్లో వీధి కుక్కలతో ఎదురవుతున్న ఇబ్బందులపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటికి శస్త్రచికిత్సలు చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్నేహ ఏజెన్సీని ఏర్పాటుచేసిందని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని పట్టణ, స్థానిక సంస్థల్లో అయిదు వేల వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయించాలని సూచించారు. వీటిపై మున్సిపల్ కమిషనర్లు తక్షణమే ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. మున్సిపల్ ఉద్యోగుల బదిలీలు, విధుల్లో చేరినవారు, ఖాళీ పోస్టుల వివరాలతో సమగ్ర నివేదికను బుధవారంలోగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, పశు సంవర్ధక శాఖ డీడీ కె.కృష్ణమూర్తి, డాక్టర్ గిరీష్, స్నేహ ఏజెన్సీ ప్రతినిధి హేమలత తదితరులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి బాలుడి మృతి

అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



చరణ్‌శ్రీతేజ (పాత చిత్రం)

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: అపార్టుమెంట్‌పై నుంచి పడి బాలుడు మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా సర్పవరం పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నగర పరిధి ఎల్‌బీనగర్‌లో ఉంటున్న ఆటోడ్రైవరు కుక్కల మల్లేశ్వరరావు కుమారుడు చరణ్‌శ్రీతేజ(13) స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం పెన్సిల్ తెచ్చుకోవడానికి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. కాసేపటికి చరణ్‌శ్రీతేజ సమీపంలోని ఓ అపార్టుమెంట్‌పై నుంచి పడి మృతి చెందాడని ఇంటికి సమాచారం అందింది. వెంటనే వెళ్లిన కుటుంబ సభ్యులు బాలుడి మృతదేహంతో తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. అసలు బాలుడు అపార్టుమెంట్‌పైకి ఎందుకు వెళ్లాడు. అక్కడ్నుంచి ఎలా పడిపోయాడనేది దర్యాప్తు చేస్తున్నామని, అతని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఎవరో పిలిస్తేనే చరణ్ అపార్టుమెంట్‌పైకి వెళ్లినట్లు తెలిసిందని, మృతిపై అనుమానాలున్నాయని అతని చిన్నాన్న వీరాంజనేయులు పేర్కొన్నారు.

రూ.10 నాణేలు స్వీకరించండి

గాంధీనగర్: రోజువారీ లావాదేవీల్లో ఎలాంటి సందేహం లేకుండా రూ.10 నాణేలు స్వీకరించాలని కెనరా బ్యాంకు రీజియన్ హెడ్ ఆర్.గణేష్ సూచించారు. బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం ఖాతాదారులు, ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాంధీనగర్, కాకినాడ ప్రధాన శాఖల్లో సమావేశాలు ఏర్పాటుచేశారు. బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనాథ్, డివిజనల్ మేనేజర్, ఎస్.అరవింద్, ఆపరేషన్స్ విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు. పలు దుకాణాలకు వెళ్లి యజమానులతో మాట్లాడి 10 రూపాయల నాణేలు దుకాణాలు, స్థానికులకు పంపిణీచేశారు. ఈ విషయంపై అవగాహన కల్పించే గోడపత్రికలు అతికించారు.

దసరా వచ్చింది.. ఆదాయం పెంచింది..

ప్రత్యేక బస్సులతో పెరిగిన ప్రయాణికుల సంఖ్య



ఆర్టీసీ కాంప్లెక్సులోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద రద్దీ

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆర్టీసీకి దసరా పండగ కలిసొచ్చింది. ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. జిల్లాలోని కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాలకు పండగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపారు. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు 15 బస్సులు, విజయవాడకు 43 బస్సులు, విశాఖనగరానికి 10, బెంగళూరు ఒకటి, కర్నూలు ఒకటి చొప్పున ప్రత్యేక పండగ రోజుల్లో కేటాయించారు. తుని నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు 30 బస్సులు, ఏలేశ్వరం నుంచి 21 బస్సులు చొప్పున నడిచాయి. పండగ రోజుల్లో ప్రత్యేక బస్సులు 53,170 కిలోమీటర్ల దూరంగా తిరిగాయి. వీటిలో 5,500 మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరారని అధికారులు తెలిపారు. రోజువారీగా రూ.5 లక్షల వరకు సంస్థ ఆదాయాన్ని అర్జించింది. ప్రైవేటు బస్సుల నిర్వాహకులు ఛార్జీలు పెంచడంతో సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులు ఆర్టీసీనే నమ్ముకున్నారు. గత ఏడాది పండగ ప్రత్యేక బస్సుల ద్వారా రూ.18 లక్షల ఆదాయం సమకూరితే.. తాజాగా రూ.21 లక్షలు ఆర్జించినట్లు అధికారులు తెలిపారు.

పక్కా ప్రణాళికతో..

దసరా పండగ రోజుల్లో ఆర్టీసీ బస్సులను పక్కా ప్రణాళికతో నడిపాం. దూర ప్రాంతాలకు ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సులు సిద్ధం చేశాం. ఆయా బస్సుల రాకపోకల సమయాలు, సాధారణ ఛార్జీలే అంటూ విస్తృతంగా ప్రచారం కల్పించాం. దీంతో ఆర్టీసీ బస్సులు ఎక్కడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపారు.

-ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి

లోవలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పూజలు



తుని గ్రామీణం: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో అమ్మవారికి సోమవారం ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం దేవస్థానం వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా దేవస్థానం డీసీ విశ్వనాథరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

తులాభార వెండి తాపడానికి అంచనాలు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో తులాభారానికి వెండి తాపడం చేయించడంపై అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న తులాభారాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. వెండి తాపడం చేయించడానికి ఎంత వెండి అవసరం అవుతుందనే అంచనాలు రూపొందించాలన్నారు. దాతల సహకారంతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



బి.యస్మిత నాగమహి

కరప: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత చేకూరుతుందని, ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని హెచ్.ఎం.శ్రీనివాసరావు సూచించారు. కరప జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి.యస్మిత నాగమహి బాలికల జూనియర్ ఖోఖో అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో సోమవారం విద్యార్థినితోపాటు ఉత్తమ తర్ఫీదునిచ్చిన పీడీ శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌లను అభినందించారు. ఈ నెల 16, 17 తేదీల్లో తమిళనాడు కుంభకోణంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ దేవు దుర్గారావు, స్టాఫ్ సెక్రటరీ శ్రీరామచంద్రమూర్తి, శ్రీనివాస్, సుదర్శన్, సుబ్రహ్మణ్యం, స్వర్ణరాణి పాల్గొన్నారు.

బడికి రానివారు 19%



అక్కడ స్ఫూర్తి

విద్యా వ్యవస్థకే ఆదర్శంగా నిలిచే దేశం ఫిన్లాండ్‌లో విద్యార్థుల గైర్హాజరు కేవలం 2.7 శాతం మాత్రమే. చాలా పాఠశాలల్లో వంద శాతం హాజరుంటుంది.

ఇక్కడ ఇలా..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్ఆర్‌జీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 396 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చే ముందురోజు(అక్టోబరు 1న) బడికి వచ్చిన వారి సంఖ్య 302. గైర్హాజరు అయినవారు 24%.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3,812 పాఠశాలల్లో సగటున 19% మంది విద్యార్థులు బడికి హాజరు కాకుండా డుమ్మా కొడుతున్నారు. మధ్యాహ్న భోజనం చేయకుండా ఇళ్లకు వెళ్లిపోవడమో.. క్యారేజీలు తెచ్చుకుని తినడమో చేస్తున్నారు. కొందరు అసలు ఊళ్లోనే ఉండడం లేదు. దీనిపై విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, పామర్రు

ఏం జరుగుతోంది?

వరుసగా పిల్లలు నెలపాటు బడి మానేస్తే అటువంటి విద్యార్థి పేరు తీసేయకుండా అదే బడిలో డ్రాప్ బాక్సులో పెడుతున్నారు. రిజిస్టరులో వారి బంధువుల నుంచి సంతకాలు తీసుకుంటున్నారు. పిల్లలు ఊరిలో లేకపోతే మేమేం చేయగలమని ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పిల్లలంతా ఒకవేళ తరువాత బడికొచ్చినా అభ్యసనలో వెనుకబడిపోతున్నారు.

పాఠశాలల హాజరు పుస్తకాల్లో విద్యార్థుల పేర్లు నమోదై ఉంటాయి. తరగతులకు మాత్రం హాజరు కావడం లేదు. కారణం ఏమిటని పరిశీలిస్తే కొందరు కుటుంబాలతో సహా వలసలు వెళ్లిపోతున్నారు. ఎక్కడున్నారో కూడా తెలియని పరిస్థితి. అప్పట్లో వైకాపా ప్రభుత్వ హయాంలో బడి బయట పిల్లలు అసలు లేరని అంకెల గారడీ చేయడానికి విద్యాశాఖ నానా తంటాలు పడింది. బడి మానేసిన, పదో తరగతి ఫెయిల్ అయిన వారి వివరాలను కూడా ఆన్‌లైన్లో పొందుపరచాలని ఆదేశించారు.

డ్రాప్ బాక్స్ ఖాళీచేయించి..

ఎక్కువ రోజులు బడి మానేసిన విద్యార్థులను డ్రాపౌట్‌గా ఆన్‌లైన్లో నమోదు చేస్తుంటారు. డ్రాప్ బాక్సును ఖాళీ చేయాలని, వారందరినీ బడిలో చేర్పినట్లు వెనక్కి తీసుకోవాలని కూడా చెప్పారు. దీంతో చేసేది లేక వారు, వీరు అని తేడాలేకుండా పిల్లలను బడిలో చేర్చుకుని హాజరు పట్టికల్లో నమోదు చేసేశారు. వారంతా కొత్త విద్యా సంవత్సరం వచ్చేసరికి ప్రమోట్ అయిపోయి కొత్త తరగతులకు పేర్లు వచ్చేశాయి. తాము ఫలానా బడిలో చదువుకుంటున్నామని, ఉత్తీర్ణత పొంది మరో తరగతికి వచ్చేశామన్న విషయం కూడా పాపం పిల్లలకు తెలియదు.

ఉన్నత పాఠశాలల్లో పరిశీలిస్తే..

అంబేడ్కర్ కోనసీమలో 17, తూర్పుగోదావరి జిల్లాలో 19, కాకినాడలో 21 శాతం మంది విద్యార్థులు పాఠశాలకు రావడం లేదు. సగటున ఈ లెక్క 19 శాతం.

ఇవీ కారణాలు

- వ్యవసాయ పనులు, పండగలు, స్థానికంగా నిర్వహించే జాతరలు, సీజనల్ వ్యాధులు, వరదల కారణంగా పిల్లల గైర్హాజరు ఎక్కువయ్యిందని విద్యాశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు.
- వలసలు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తోంది.
- ఇటుక బట్టీల పనులు, రొయ్యల చెరువుల పనులకు కూడా పలువురు వెళ్లడం, రావడం జరుగుతోంది. ఇలాంటివన్నీ కూడా హాజరు తక్కువగా ఉండడానికి కారణాలుగా కనబడుతున్నాయి.

సరిదిద్దే ప్రయత్నం

ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమీక్షిస్తూ.. విద్యార్థుల హాజరు శాతం ఎందుకు తక్కువగా ఉంటోంది? పేర్లున్న వారందరూ బడికి ఎందుకు రావడం లేదు? తెలుసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ముందుగా క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలు, కారణాలను అన్వేషిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పరిస్థితి చక్కదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



చేబ్రోలులోని పట్టు పరిశ్రమ కేంద్రం ఎదుట నిరసనలో రైతులు

పట్టు రైతుల ఆందోళన

గొల్లప్రోలు: పట్టు పురుగులను నిర్ణీతకాలం పెంచిన గూళ్ళు తయారుకాకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన చేశారు. చేబ్రోలు పట్టుపరిశ్రమ కేంద్రం ఎదుట సోమవారం రైతులు ధర్నా నిర్వహించి అధికారులకు సమస్యను విన్నవించారు. గత నెల 16 నుంచి 23వ తేదీ వరకు తెచ్చిన గుడ్లతో తయారైన పట్టుపురుగులను షెడ్లలో పెంచామని, నిర్ణీత కాలం ముగిసినా పట్టుగూళ్ళు తయారుకాకుండా పురుగులుగానే మిగిలి ఉండడంతో తాము నష్టపోయామని చెప్పారు. సుమారు రూ.10 లక్షల మేర నష్టపోయినట్లు వివరించారు. ఆదుకోవాలని కోరారు. ఉన్నతాధికారులకు సమస్య తెలిపినట్లు పట్టుపరిశ్రమశాఖ అధికారి మోసయ్య వివరించారు.

లంపకలోవ హైస్కూల్లో విగ్రహ ధ్వంసం



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: లంపకలోవ జడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. దసరా సెలవులు అనంతరం సోమవారం పాఠశాల తెరవగా విగ్రహాన్ని సిమెంటు దిమ్మపై నుంచి పడగొట్టి పగలగొట్టినట్లు గుర్తించారు. ఈ విషయమై పాఠశాల కమిటీతో పాటు ప్రధానోపాధ్యాయుడు ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం హుటాహుటిన వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. పాఠశాలకు ప్రహరీ, వాచ్‌మన్ ఉన్నా ఆవరణలోని విగ్రహం ధ్వంసం కావడంపై విచారణ ముమ్మరం చేశారు. విగ్రహం ధ్వంసానికి కారణమైన వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ పేర్కొన్నారు.



ఆటోను లేపుతున్న వాహనదారులు

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: సామర్లకోట కాకినాడ ప్రధాన రహదారి నిత్యం జరిగే ప్రమాదాలతో రక్తసిక్తమవుతోంది. మార్గం పొడవునా గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనేఉన్నాయి. మండలంలోని మాధవపట్నం సమీపంలో ఆదివారం గుంతల్లో పడి కుదుపులకు ద్విచక్ర వాహనంపై కూర్చున్న మహిళ వెనక్కి పడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా సోమవారం మాధవపట్నం సమీపంలో ప్రయాణికులతో వస్తున్న ఆటో గుంతల్లో బోల్తాపడింది. సామర్లకోటకు చెందిన ముగ్గురు మహిళలు ప్రతాప్‌నగర్‌లోని బంధువుల ఇంటి వద్ద జరిగే వేడుకకు వెళుతుండగా మాధవపట్నం వద్దకు వచ్చేసరికి ఆటో ప్రమాదానికి గురైంది. ఆటోలో కేకలు పెడుతున్న మహిళలను ఇతర వాహనదారులు రక్షించారు. వారిలో ఓ మహిళ చేయి విరిగిపోగా మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదిలా ఉండగా గుంతల్లో పడిన ఆటో వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఫిర్యాదు మాత్రం అందలేదని సామర్లకోట పోలీసులు తెలిపారు.

కమిషనర్-డీఈ బాహాబాహీపై విచారణ

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పురపాలికకు సంబంధించి ఆగస్టు 31న జరిగిన కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కనకారావు, డీఈ భవానీశంకర్ బాహాబాహీకి దిగడం అప్పట్లో సంచలమైంది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సెప్టెంబరు 25న ఉన్నతాధికారులైన పి.పూర్ణచంద్రరావు, ఎం.బ్రహ్మాజీ, బి.శ్రీనివాసులుతో కమిటీని విచారణకు నియమించింది. సోమవారం వారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి విచారించారు. వీడియోలు పరిశీలించారు. సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, ఉద్యోగులు, గొడవకు దిగిన కమిషనర్, డీఈల వివరణ తీసుకున్నారు.



కౌన్సిలర్ల అభిప్రాయాలు తెలుసుకుంటున్న కమిటీ సభ్యులు

ఇద్దరినీ మార్చేయండి..: ఆ రోజు కౌన్సిల్ సమావేశంలో ఇంజినీరింగ్ పనులు, పొరుగు సేవల ఉద్యోగుల నియామకం, డీఈకి బదులు ఈఈతో సంతకాలు తదితర అంశాలపై కౌన్సిలర్లు కమిషనర్‌ను ప్రశ్నించారు. సమాధానం చెప్పే క్రమంలో కమిషనర్ డీఈని దూషించారు. ఆ వెంటనే ఇద్దరూ బాహాబాహీకి దిగారని విచారణకు హాజరైన 23 మంది కౌన్సిలర్లు అధికారులకు వివరించారు. ఇలా చాలా వ్యవహారాలు జరుగుతున్నాయని, విచారణ చేయాలని అధికారులను కోరారు. పురపాలిక పరువుతీసిన వీరిద్దరినీ మార్చేయాలని కోరారు. బాగా పనిచేసే అధికారులను నియమించాలని కోరారు.

సొసైటీ బకాయిదారుల జాబితా విడుదల చేయాలి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడి వ్యవసాయ సహకార సొసైటీ సర్వసభ్య సమావేశంలో అధికారులపై రైతులు భగ్గుమన్నారు. ఏడాది కిందట చేపట్టిన విచారణ నివేదిక ఏమైందంటూ నిలదీశారు. సొసైటీలో రూ.130 కోట్లకు చెందిన బకాయిదారుల జాబితాను బయటపెట్టాలని రైతులు డిమాండ్ చేశారు. వ్యవసాయ సహకార సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఎమ్.రంగనాయకులు ఆధ్వర్యంలో సొసైటీ ఆవరణలో నిర్వహించారు. కిర్లంపూడి, వేలంక, చిల్లంగి, తదితర గ్రామాలకు చెందిన రైతునాయకులు సొసైటీ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిదారుల జాబితాను వెంటనే బయటపెట్టాలని రైతు నాయకులు నీలగిరి చిట్టిబాబు, పెంటకోట శ్రీరాములు, మాజీ సర్పంచి పెంటకోట నాగబాబు తదితరులు డిమాండ్ చేశారు. సమావేశానికి వచ్చిన చిల్లంగి గ్రామ రైతు దాడి రాజు తనకు రూ.లక్ష బకాయి ఉందని దీన్ని రెండేళ్ల కిందటే తీర్చేశానని మళ్లీ అప్పు తీర్చాలంటూ నోటీసులు ఎలా ఇస్తారంటూ అధికారులను నిలదీశారు. రైతుల హాజరు శాతం తక్కువగా ఉందంటూ మరోసారి సమావేశం నిర్వహిస్తామంటూ అధికారులు సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు.



పర్సన్ ఇన్‌ఛార్జికు బకాయి నోటీసు చూపుతున్న రైతు రాజు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

తీపిజొన్న సాగు.. లాభాలు బాగు

రైతేరాజు



న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

స్ఫూర్తి

మొక్కజొన్న పొత్తులు(స్వీట్‌కార్న్) చూస్తే ఎవర్కైనా నోరూరుతుంది. వీటికి మార్కెట్‌లో గిరాకీ ఉండటంతో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ఈ పంటను జిల్లాలోని పలుచోట్ల పండిస్తున్నా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి పొత్తులకు మాత్రం ప్రత్యేక గుర్తింపు ఉంది. సారవంతమైన నల్లరేగడి నేలలు కావడంతో నాణ్యత, రుచి, సైజులో పెద్దవిగా ఉండటం వీటి ప్రత్యేకత. దీంతో ఇక్కడి పొత్తులకు మంచి గిరాకీ ఉందని రైతులు చెబుతున్నారు. స్థానిక వ్యాపారులతో పాటు జిల్లాలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, బెంగళూరు, తమిళనాడు, ఒడిశా వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. స్వీట్‌కార్న్‌తో పాటు కోళ్ల దాణాకు ఉపయోగించే పొత్తులను ఇక్కడి రైతులు విస్తారంగా పండిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పండించిన వాటిని అమ్మేందుకు సైతం తీసుకురావడంతో ఏడాది పొడవునా పొత్తులు అందుబాటులో ఉండి కొనుగోలుదారులతో మార్కెట్ కళకళలాడుతోంది.

పంట దిగుబడి ఇలా...

మార్కెట్‌లో లభించే నాణ్యమైన మొక్కజొన్న విత్తనాలను ఎంపిక చేసుకుని నాట్లు వేస్తారు. ఎకరాకు 6 నుంచి 7 టన్నుల దిగుబడి వస్తుంది. టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర ఉంటుంది. కాట్రావులపల్లి, యర్రంపాలెం, సీతానగరం తదితర గ్రామాలతో పాటు మండలంలోని సుమారు 150 ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్నారు. ఇక్కడ పండించిన పంటకు స్థానికంగానే మార్కెట్ ఉండటంతో ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు.



కాట్రావులపల్లిలో పండిస్తున్న మొక్కజొన్న

మెలకువలు పాటిస్తే ..



రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పండిస్తున్నా. పెట్టుబడి, శిస్తు, ఎరువులు, కూలీల ఖర్చు పోను ఎకరాకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. నాట్లు వేసిన 70 నుంచి 80 రోజుల్లో పూర్తవడంతో ఏడాదికి మూడుసార్లు పంట వేయడంతో ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం సమకూరుతుంది. సాగులో మెలకువలు పాటిస్తే మంచి ఆదాయం వస్తుంది.

- గంధం దుర్గాప్రసాద్, కౌలురైతు

కోకోలో తెగుళ్లు నివారిద్దాం..



కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో పంటకు సంబంధించిన వివిధ సమస్యలపై రైతులు అడిగిన ప్రశ్నలకు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త బి.నీరజ పలు సూచనలు ఇచ్చారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట

ప్రశ్న సమాధానం

● అకాల వర్షాల ప్రభావంతో కోకోలో కాయకుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి?

- ఎ.రాజమోహన్, రైతు, పుల్లేటికుర్రు

సమాధానం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కాయకుళ్లు తెగులుకు సోకడానికి అనుకూలం. ఈ తెగులుకు ప్రధాన కారణం ఫైటోఫ్తోరా పామివోరా అనే బూజు జాతి శిలీంద్రం. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు.. లీటరు నీటిలో కలిపి కాయలు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి.

● కోకో పంటకు సోకే గజ్జి తెగులు నివారణ చర్యలు తెలపండి?

- జి.వెంకటేశ్వరరావు, రైతు, ముమ్మిడివరం

సమాధానం: కోకో చెట్టు కాండంపై ముదురు ఎరుపురంగు చిక్కటి జిగురు కారి, క్రమేణా అవి ఎండి తుప్పు మరకలా కనిపిస్తాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు లేదా ట్రైకోడెరా బూజు జాతి శిలీంద్రం పేస్టును మచ్చలపై పూతలా వేయాలి.

సేంద్రియ ఎరువుతో నాణ్యమైన పట్టు



గొల్లప్రోలు: సేంద్రియ ఎరువుల వాడకంతో నాణ్యమైన మల్బరీ ఆకును ఉత్పత్తి చేసి పట్టుగూళ్ల పెంపకంలో అధిక దిగుబడులు సాధించొచ్చని పట్టుపరిశ్రమల శాఖ అధికారి **మోసయ్య** తెలిపారు. నాణ్యమైన మల్బరీ ఆకును పొందేందుకు తోటల పెంపకంలో చేపట్టాల్సిన చర్యలను ఆయన ఇలా వివరించారు.

తెలుసుకుందాం..

◆ ప్రతి పంటకు ముందు పశువుల ఎరువులను విధిగా వేయాలి. తద్వారా ఆకు నాణ్యత పెరిగి.. వీటిని ఆహారంగా తీసుకున్న పట్టుపురుగు నాణ్యమైన గూడును అల్లుతుంది. ◆ భూసారాన్ని బట్టి అవసరమైతే కాంప్లెక్స్ ఎరువులు వాడాలి. యూరియా వాడకాన్ని తగ్గించాలి. ◆ కోత కోసిన 50 రోజుల తరువాత మాత్రమే ఆకులను పట్టు పురుగులకు మేతగా వేయాలి. ◆ మల్బరీ తోటలో యూరియా అధికంగా వేస్తే పట్టు పురుగులకు పొరుడు రోగం ఆశించి నష్టం వాటిల్లుతుంది. ◆ బైవోల్టిన్ పట్టు పురుగులు పెంచే రైతులు విధిగా పశువుల ఎరువులను ఉపయోగించాలి. ◆ పట్టు పురుగులు పెంచే షెడ్లలో 25-28 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా చూడాలి. తేమ విషయమై నిరంతరం పర్యవేక్షించాలి.

ఇలా చేస్తే పండుగప్పతో ఆదాయమే..



ఉప్పలగుప్తం: పండుగప్ప చేపల సాగులో వ్యాధుల బెడద వేధిస్తోంది. జాగ్రత్తలు పాటిస్తే నివారించవచ్చని ఉప్పలగుప్తం మత్స్యశాఖాధికారి **హేమనంద్** సూచిస్తున్నారు.

వ్యాధి ఇలా..: పండుగప్పలకు ఆహారంగా చైనా గొరకలు, రొయ్యల ప్రోసెసింగ్ కంపెనీల నుంచి సేకరించిన వ్యర్థాలను రైతులు వేస్తున్నారు. వ్యాధి ప్రభావం ఉన్న చెరువుల నుంచి సేకరించినది కావడంతో రెడ్, తాటాకు, బూజు తెగుళ్లు సోకుతున్నాయి.

మీ కోసం


జాగ్రత్తలు: ◆ పట్టుబడి పూర్తయిన చెరువులను నెర్రలు వచ్చేవరకూ ఎండబెట్టాలి. ◆ పిల్లెట్ రూపంలో మార్కెట్లోకి వచ్చిన ప్రొటీన్ మేత ఇస్తే వ్యాధులు రావు. ◆ ల్యాబ్ పరీక్షలు చేయించి నిపుణుల సూచనలు పాటించాలి. నీటి మార్పిడి చేసుకుని చెరువు శుభ్రతకు శానిటైజర్లు చల్లుకోవాలి.

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- విశ్వం, వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, జనక అయితే గనక, సత్య సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, మానాన్న సూపర్‌హీరో, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- మానాన్న సూపర్‌హీరో, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సిఎండ్‌సీ 1- జనక అయితేగనక, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- విశ్వం, శ్రీశ్రీనివాసా(వేళంగి)- విశ్వం.

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)



గాంధీనగర్: టమాటా - 40, వంకాయలు - 50, 54, 66, బెండకాయలు - 22, పచ్చిమిర్చి - 40, 58, కాకర కాయ - 34, బీర - 26, 36, కాలీఫ్లవర్ - 15, 20, క్యాబేజీ - 40, క్యారెట్ - 40, దొండకాయలు - 30, బంగాళాదుంపలు - 30, 35, ఉల్లి - 45, 50, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 36, ఆనపకాయ - 40, పొట్లకాయ - 18, 20, అరటికాయ - 6, 7, చిక్కుళ్లు - 120, చేమదుంపలు - 30, 40, మునగకాడలు - 8, 10, బీట్‌రూట్ - 38, కీరదోస - 26, బీన్స్‌గింజలు - 130, అల్లం - 54, క్యాప్సికం - 84, బొబ్బర్లు - 44, చిలగడదుంపలు - 40, మామిడికాయ ఒకటి - 15, 18, నిమ్మకాయలు (డజన్) - 24, 54.

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్తను తొలగించండి



సమస్య: నగరంలోని 41వ డివిజన్ గాంధీనగర్ శ్రీసాయిభావన అపార్ట్‌మెంట్ వద్ద చాలా రోజులుగా చెత్త పేరుకుపోయింది. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తరలించకుండా వదిలేశారు. **- స్థానికులు, గాంధీనగర్**

కాలువలు శుభ్రం చేయడంలేదు

సమస్య: రామకృష్ణారావుపేట వీధుల్లో పారిశుద్ధ్య సిబ్బంది కాలువలు శుభ్రం చేయడంలేదు. దీంతో వర్షం కురిసినప్పుడు మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. **- సత్య, వ్యాపారి, రామకృష్ణారావుపేట**

సమాధానం: సిబ్బందిని పంపించి చెత్త తరలిస్తాం. రామకృష్ణారావుపేటలో కాలువలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం.

- రాంబాబు, శానిటరీ సూపర్‌వైజర్, నగరపాలక సంస్థ

రోడ్డును ఆక్రమించేశారు..



వైఎస్సార్ ఫ్లైఓవర్ దిగువన కొత్తపేట మార్కెట్ వైపు వెళ్లే మార్గంలో టైర్లు, ఇతర దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కోసారి బస్సులు ఆ ప్రాంతంలో ఆగడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు, కొత్తపేట మార్కెట్**

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:

సాంబమూర్తినగర్: 91548 46719

‘కిక్కు’రిసిన కలెక్టరేట్

లాటరీ సమయంలో దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ కలెక్టరేట్ మద్యం దుకాణ దరఖాస్తుదారులతో కిక్కిరిసింది. లాటరీ విధానంలో దుకాణాలు కేటాయింపు ప్రక్రియ సోమవారం చేపట్టడంతో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుదారులు ఆసక్తిగా తరలివచ్చారు. అందరిలోనూ ఒకటే ఉత్కంఠ. మద్యం దుకాణం రూపంలో అదృష్టం వరిస్తుందో లేదోనని ప్రతీ క్షణం ఆందోళనకు లోనయ్యారు. దుకాణాలు దక్కినవారి కళ్లలో సంతోషం కనిపించగా రూ.2 లక్షల రుసుంతో దరఖాస్తు చేసిన మిగిలిన వారు నిరాశగా వెనుదిరిగారు. జిల్లాలోని 155 దుకాణాల కేటాయింపునకు దాఖలైన 3,332 దరఖాస్తులను పరిశీలించి లాటరీ పద్ధతిలో ఎంపికచేశారు. దుకాణదారులు ఈనెల 16 నుంచి మద్యం విక్రయించుకునేలా అనుమతిచ్చారు.



కలెక్టరేట్‌లో మద్యం దుకాణాల కేటాయింపుకు లాటరీ తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

డీఆర్వో డి.తిప్పేనాయక్, ఆర్డీవో ఎస్.మల్లిబాబు, ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ వై.చైతన్యమురళి, అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి లాటరీ ప్రక్రియను పర్యవేక్షించారు.

సిండికేట్లకు చుక్కెదురు..?

మద్యం దుకాణాల దరఖాస్తుతో చెల్లించే సొమ్ము తిరిగి వచ్చేది కాకపోయినా కొంతమంది సిండికేట్‌గా ఏర్పడ్డారు. గరిష్ఠంగా ఒక్కో సిండికేట్ 50 దరఖాస్తుల వరకు దాఖలు చేశారు. వీరిలో చాలా మందికి నిరాశే ఎదురైంది. ఇలాంటి వారికి రెండు, మూడు దుకాణాలు తప్ప ఎక్కువ రాలేదు. తెదేపా, జనసేన, వైకాపాకు చెందిన కొందరు నేతలు వెనక ఉండి అనుచరులతో దరఖాస్తు చేయించి కొన్ని దుకాణాలను దక్కించుకున్నారు. లాటరీలో విజేతలు దుకాణాల అన్వేషణలో పడ్డారు. వీరిలో కొంతమంది పాత మద్యం వ్యాపారులను సంప్రదిస్తున్నారు. అయితే లాభాల్లో వాటా ఇస్తే దుకాణం ఇస్తామనే ధోరణిలో కొందరు మాట్లాడుకుంటున్నారు.

పండగ ముగిసినా తగ్గని రద్దీ

సాంబమూర్తినగర్: దసరా పండగ ముగిసినా సోమవారం కాకినాడ ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల రద్దీ కొనసాగింది. ప్రధానంగా ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన ప్రయాణికులు ఆది, సోమవారాల్లో తిరుగు పయనమయ్యారు. రిజర్వేషన్ కౌంటర్లతో పాటు రాజమహేంద్రవరం నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ అధికంగా కనిపించింది. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా డిపో అధికారులు ఎప్పటికప్పుడు బస్సులను సిద్ధం చేశారు.



రాజమహేంద్రవరం నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

ఇష్టానుసారంగా కార్ల పార్కింగ్..

రాజమహేంద్రవరం నాన్‌స్టాప్ బస్సులు ఆగే స్థలంలోనే కొందరు ఇష్టానుసారం కార్లు నిలపడంతో ప్రయాణికులు అవస్థలకు గురయ్యారు. బస్సులకు సమీపంలోనే కార్లు నిలపడంతో రాకపోకలకు అడ్డంకి మారాయి. నాన్‌స్టాప్ బస్సులు ఆగేచోట ఎట్టి పరిస్థితుల్లోను ఇతర వాహనాలను అనుమతించకూడదు. అయినా కొందరు కార్ల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సమీపంలోనే సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించారని ప్రయాణికులు ఆరోపించారు.

బేస్‌బాల్, పెంటాథ్లాన్ ఎంపికలు వాయిదా

మసీదుసెంటర్ (కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్‌ఏ మైదానంలో మంగళవారం చేపట్టాల్సిన బేస్‌బాల్, మోడరన్ పెంటాథ్లాన్ క్రీడా పోటీల ఎంపికలు భారీ వర్షం హెచ్చరికలతో వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి జార్జి తెలిపారు.



వేలంలో లడ్డూ దక్కించుకున్న వీరేంద్ర, పక్కన ఈవో తదితరులు

లడ్డూ ధర రూ.1,11,119

గాంధీనగర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల్లో బాలాత్రిపురసుందరి అమ్మవారికి మహేంద్ర మిఠాయివాలా వారు సమర్పించిన లడ్డూను సోమవారం రాత్రి బహిరంగ వేలంలో విక్రయించారు. ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో జరిగిన వేలంలో 250 కిలోల ప్రసాదాన్ని కాకినాడకు చెందిన చలికి వీరేంద్ర రూ. 1,11,119 చెల్లించి సొంతం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో తొలిసారి నిర్వహించిన వేలంలో లడ్డూ అమ్మవారి అనుగ్రహంతో అందుకున్నానని చెప్పారు. ఆలయ అర్చకులు విజయ్, రాజ్‌కుమార్ ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదాన్ని ఆయనకు అందించారు. కార్యక్రమంలో గ్రంధి బాబ్జి, నేమాని సత్యనారాయణ, కాంబాబు, నల్లూరి తులసి, ముత్యాల రాణి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వర్షం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పలు రహదారులు వర్షపునీటితో నిండిపోయాయి. చిన్నమార్కెట్, కొత్తకాకినాడ, శాంతినగర్, పలు ఉద్యానాలు, క్రీడా మైదానాలు, టౌన్ రైల్వేస్టేషన్ ప్రాంగణం తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలువల్లోని మురుగు రోడ్డుపైకి చేరింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు.



టౌన్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు

నగరంపై ప్రత్యేక దృష్టి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరం సముద్ర మట్టానికి దిగున ఉండటం, చిన్నపాటి వర్షానికే ముంపు బారిన పడుతున్న నేపథ్యంలో భారీ వర్షసూచన రావడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ సోమవారం అమరావతి నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీంతో కమిషనర్ భావన అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షపు నీటి ప్రవాహపు డ్రెయిన్ల యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షపు నీటిని తొలగించడానికి జేసీబీలు, యంత్రాలను సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలు అనివార్యమైతే అక్కడ ఆహారం, పాలు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కాకినాడ కమిషనర్ భావన

వైద్య విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానాలకు చేరాలని రంగరాయ వైద్య కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ అన్నారు. సోమవారం కళాశాలలోని ఫిజియాలజీ లెక్చర్ హాల్‌లో 2024 ఎంబీబీఎస్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంతో పాటు ఫౌండేషన్ కోర్సును జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముందుగా ఆవిష్కరణ వేడుకల్లో 2024 బ్యాచ్ వైద్య విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డా.విష్ణువర్ధన్, భారత వైద్య విద్యార్థుల పాత్ర అంశంపై ప్రసంగించారు. అకడమిక్ వైస్‌ప్రిన్సిపల్ డా.డీవీఎస్ శశి, పాథాలజీ ప్రొఫెసర్ డా.రాజ్యలక్ష్మి, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ డా.భాగ్యలక్ష్మి, అనాటమీ వైద్య నిపుణులు డా.బి.లలిత, ఫార్మకాలజీ ప్రొఫెసర్ డా.వీరయ్య, ఫోరెన్సిక్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సతీష్ తదితరులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎంసీ వైస్‌ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్

తపాలా కార్యాలయంలో పాము హల్‌చల్..

సాంబమూర్తినగర్ (కాకినాడ): కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని తపాలా కార్యాలయంలో సోమవారం ఉదయం ఓ పాము హల్‌చల్ చేయడంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. కార్యాలయ సిబ్బందితో పాటు పని మీద వచ్చినవారు చూస్తుండగానే.. ఓ పాము లోనికి ప్రవేశించి బల్ల కిందకు చేరింది. దీంతో ఉద్యోగులతో పాటు బయటి వ్యక్తులు బయటకు పరుగులు తీశారు. ఎంతకీ అది బయటకు రాకపోవడంతో పాముల పట్టే వ్యక్తికి సమాచారం అందించారు.



కార్యాలయంలో పాము ఉందనే భయంతో బయట ఉన్న సిబ్బంది

స్టేషన్ పరిసరాల్లో భయం.. భయం..

టౌన్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో పెద్దఎత్తున పొదలు పెరిగిపోయాయి. రైల్వే ట్రాక్ వెంబడి, ఫ్లైఓవర్ దిగువన పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో అందులోంచి పాములు, తేళ్లు, జెర్రులు చేరాయి. వర్షాలు పడినప్పుడు పాములు రోడ్లపైకి, సమీపంలోని ఇళ్లలోకి చేరుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంతా గజిబిజి.. రోడ్డెక్కితే హడావుడి

నగరంలో ట్రాఫిక్ కష్టాలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్ కష్టాలతో జనం అల్లాడుతున్నారు. నగర పరిధి పెరగడం, వాహనాలు సంఖ్య రోజురోజుకు అధికమవ్వడం, రహదారులు ఇరుకుగా ఉండటం, ఎక్కడ బడితే అక్కడ బస్సులు, వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో జనం అవస్థలు పడుతున్నారు. నగరంలో భానుగుడి, నాగమల్లితోట కూడలి, సర్పవరం తదితర కూడళ్ల వద్ద మాత్రమే స్నిలింగ్ వ్యవస్థ ఉంది.

సిగ్నళ్లు ఏవి..?

నగరంలో మిగిలిన ప్రధాన కూడళ్లు అయిన కోకిల సెంటర్, శాంతినగర్ కూడలి, గాంధీబొమ్మ సెంటర్, రామారావులపేటలోని పలు కూడళ్లు, పాతబస్టాండ్ కూడలి, ఇంద్రపాలెం కూడళ్ల వద్ద ఎటువంటి సిగ్నలింగ్ వ్యవస్థ లేదు. దాంతో ప్రధాన కూడళ్ల వద్ద నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో రహదారులు రద్దీగా దర్శనమిస్తాయి. ఈ ప్రధాన కూడళ్ల వద్ద రద్దీ పెరిగిపోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం, సరైన పోలీసు గస్తీ లేకపోవడం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. గత ఐదేళ్ళ వైకాపా పాలనలో రహదారులు విస్తరణ, సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం, డివైడర్ల నిర్మాణం వంటి వాటిపై దృష్టి సారించక పోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ఆక్రమణల వల్ల కూడా నగర రహదారులు కుచించుకుపోయాయి. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అయిదేళ్లలో నగరంలో ఎలాంటి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినా దాఖలాలు లేవు. నగరంలో సుమారు 4.50 లక్షల జనాభా ఉన్నారు. ఇంత పెద్ద నగరంలో రెండు మూడు చోట్ల తప్ప మిగిలిన కూడళ్ల వద్ద సిగ్నల్స్ వ్యవస్థ లేకపోవడం, సరైన ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.



జగన్నాథపురం వంతెనపై వాహనాల రద్దీ



కోకిల సెంటర్ వైఎస్‌ఆర్ కూడలిలో ఇష్టారాజ్యంగా రాకపోకలు

నిత్యం వాహనాలతో రద్దీ..

జిల్లా కేంద్రం కావడంతో ఉద్యోగ, వ్యాపార, విద్య, ఇతర పనుల నిమిత్తం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం 7 నుంచి 11 గంటలు, సాయంత్రం 4 నుంచి 9గంటల మధ్య నగర రహదారులు రద్దీగా మారుతున్నాయి. ఆయా సమయాల్లో పాదచారులు రోడ్డు దాటాలన్నా, వాహనాలు ముందుకు సాగాలన్నా కష్టతరంగా మారుతోంది. గతంలో కోకిల సెంటర్, వైఎస్‌ఆర్ కూడలి, జగన్నాథపురం కొత్త వంతెన కూడలి, వార్ఫురోడ్డు వంటి రదారులు, కూడళ్లలో జరిగిన రోడ్డుప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉద్యానం పరిశుభ్రం..



ఉద్యానాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాంబమూర్తినగర్: నగరంలోని 13వ డివిజన్ సాంబమూర్తినగర్ డాల్ఫిన్‌కాలనీ ఉద్యానాన్ని పారిశుద్ధ్య సిబ్బంది సోమవారం శుభ్రం చేశారు. స్థానికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, మూడు ఉద్యానాల్లో వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని ఈనెల 14వ తేదీన ‘సాంబమూర్తినగర్‌పై శీతకన్ను’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురించిన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. నిర్వహణకు నోచుకోక కళావిహీనంగా మారిన పార్కులో పనులు చేపట్టారు. నడకదారిలో మొలిచిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు.

కొత్త బాక్సు ఏర్పాటు

ఈనాడు కథనాలకు స్పందన



గొడారిగుంటలో కొత్త బాక్సు అమర్చిన సిబ్బంది

సాంబమూర్తినగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో నియంత్రికల వద్ద ఫ్యూజు బాక్సులు ప్రమాదకరంగా మారాయి. వాటికి తలుపులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, ఉద్యానవనాల వద్ద ఫ్యూజ్ బాక్సులు చేతికందే ఎత్తులో ఉండటంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాలను వివరిస్తూ ఈనెల 11న ‘ప్రమాదమైనా పట్టించుకోరా..’ శీర్షికతో ‘ఈనాడు’లో ప్రచురించిన కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. గొడారిగుంట సీతారామ్‌నగర్ వద్ద పాత బాక్సు తొలగించి కొత్తది అమర్చి సమస్యను పరిష్కరించారు.

విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ నియామకాలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ 2022-23 సంవత్సరానికి సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ను అనుసరించి ప్రతిభ ఆధారంగా ఆరుగురు అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించారు. మూడు జూనియర్ సహాయకులు, మూడు టైపిస్టు పోస్టులను భర్తీ చేశారు. ప్రతిభ జాబితా ప్రకారం ఈనెల 10న వీరికి కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్ష నిర్వహించారు. అర్హత సాధించిన ఆరుగురికి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ నియామక పత్రాలు అందించారు. వీరిలో ఇద్దరు అంధులు, ఒకరు మానసిక విభిన్న ప్రతిభావంతుడు, ముగ్గురు బధిర అభ్యర్థులు ఉన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ సహాయ సంచాలకుడు, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విద్యార్థుల సాయం

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ద్వారా విద్యార్థులు సమకూర్చిన ఆర్థికసాయాన్ని సీఎం సహాయనిధికి విరాళంగా అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌కు రూ.21,300 చెక్కును విద్యార్థులు అందజేశారు.

రాత్రిపూట ప్రత్యేక డ్రైవ్‌లు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: రాత్రిపూట నగరంలో ప్రత్యేక పోలీసు బృందాలతో గస్తీ నిర్వహిస్తున్నట్లు కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు చెప్పారు. ఆదివారం అర్ధరాత్రి నాగమల్లితోట కూడలిలో వాహనదారులకు శ్వాస పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రోజూ ఒక కూడలిని ఎంపికచేసి వాహనాలు, లాడ్జీల్లో తనిఖీలతో పాటు ప్రత్యేక బృందాలతో రాత్రిపూట నగరమంతా గస్తీ తిరగడం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కాకినాడ పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్, ట్రాఫిక్ సీఐ రామారావు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘మైనింగ్ వాళ్లను బెదిరించారనడం అవాస్తవం’

మసీదు సెంటర్ (కాకినాడ): డిప్యూటీ సీఎం పేరు చెప్పి మైనింగ్ వాళ్లను బెదిరించారనడం అవాస్తవమని కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి డి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రభుత్వం చేసిన పారదర్శక బదిలీల్లో కాకినాడ డీఎఫ్‌వోగా బాధ్యతలు స్వీకరించి రెండు రోజులు మాత్రమే విధుల్లో ఉండి, తరవాత కుటుంబం, లగేజీ తీసుకొచ్చేందుకు పాతస్టేషన్‌కు వెళ్లానన్నారు. కాకినాడ ప్రాంతం తనకు కొత్తని, ఇక్కడ జరిగే విషయాలపై అవగాహన లేదన్నారు. నేను కాకినాడలో విధుల్లో చేరడం ఇష్టం లేని వాళ్లు దుష్ప్రచారం చేసి ఉంటారన్నారు.

ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. టెట్‌లో ఉత్తీర్ణులైన వారికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి అందులో 85 శాతం, టెట్‌లో పొందిన మార్కులకు 15 శాతం వెయిటేజీని ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈనెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. ఈనెల 27న స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తారని ఆయన వివరించారు.

తాగి వాహనం నడిపినవారికి జైలు, జరిమానా

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన 15 మందిపై పోలీసులు కేసులు నమోదుచేసి సోమవారం కోర్టులో హాజరుపర్చారు. వీరిలో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, 13 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు పై విధంగా తీర్పు చెప్పారని రు. నగర ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలిపారు.

ఆరోగ్య శాఖ విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలిచిన సచివాలయ ఏఎన్‌ఎంలను తక్షణమే ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకోవాలని ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీరజ, నాగవరలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలను ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకోవాలని కోరుతూ సచివాలయ ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్‌కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభారాణి, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రతన్‌రాజుతో కలిసి వారు మాట్లాడారు. ఆరోగ్య శాఖ సిబ్బందికి అమలుచేసే 35 రోజుల క్యాజువల్ లీవ్స్ వర్తింపజేయాలని, మొబైల్ యాప్స్ పని భారాన్ని తగ్గించాలని కోరారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చీకట్ల శ్రీనివాసరావు, ఎండీ ఇబ్రహీం, సీహెచ్.ఉషా, బి.రాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నాలో కార్మికులు

సేవలతో ముందుకు వెళతాం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రజలకు అవసరమైన సేవలు చేస్తూ ముందుకు వెళ్లాలని అలయెన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం బాలాజీచెరువు కాస్మోపాలిటన్ క్లబ్‌లో అలయెన్స్ క్లబ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నూతన క్లబ్ అలయెన్స్ క్లబ్ శ్రీపద్మారామ్ ప్రతిష్ఠాపన మహోత్సవంలో సభ్యులతో ఆయన ప్రమాణం చేయించారు. ముఖ్యఅతిథిగా క్లబ్ గవర్నర్ వి.శ్రీనివాసరావు హాజరయ్యారు క్లబ్ అధ్యక్షుడిగా పి.శివకుమార్, కార్యదర్శిగా టి.వీరభద్రరావు, కోశాధికారిగా వరప్రసాద్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వివిధ క్లబ్‌లకు చెందిన సభ్యులు దుర్గాసుభద్ర, గోవిందరాజులు, దిలీప్‌కుమార్ సదనాని, ఎన్.శ్రీనివాసు, రజనీగౌరి, వాణి పాల్గొన్నారు.



క్లబ్ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

‘ఘాటీ సెంటర్లో మద్యం దుకాణం వద్దు’

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: జగన్నాథపురం ఘాటీ సెంటర్లో మద్యం దుకాణం ఏర్పాటుచేయవద్దని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాల, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, విద్యా దాత మల్లాడి సత్యలింగం నాయకర్ విగ్రహం, బీఆర్ అంబేడ్కర్, పులే, బాబూజగజ్జీవన్‌రామ్, కాన్సీరామ్ తదితర ప్రముఖుల విగ్రహాలు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని డోకుబుర్ర భద్రం, ఆవుపాటి ఉమాశంకర్, షేక్ హుస్సేన్, కె.మోజేష్‌కుమార్ తదితరులు కోరారు.

చికిత్సపొందుతూ ముగ్గురి మృతి

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలం, అమినాబాదకి చెందిన కె.రాజు (28) జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందారు. వ్యక్తిగత కారణాలతో గడ్డిమందు తాగిన ఆయన అస్వస్థతకు గురవడంతో ప్రథమచికిత్స అనంతరం ఈనెల 13న జీజీహెచ్‌లో చేర్చారు. ఘటనపై యు.కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

● కిర్లంపూడికి చెందిన ఎన్.రమణ (50) చికిత్సపొందుతూ సోమవారం ప్రాణాలు కోల్పోయారు. గడ్డిమందు తాగి అస్వస్థతకు గురైన ఆయనను ఈనెల 13న జీజీహెచ్‌లో చేర్చారు. దీనిపై కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు.

● ఏలేశ్వరం మండలం జె.అన్నవరానికి చెందిన బి.జాన్‌బాబు (26) చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందారు. గడ్డిమందు తాగిన ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను గత నెల 29న జీజీహెచ్‌లో చేర్చారు. దీనిపై ఏలేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు.

డయల్ యువర్ కమిషనర్‌కు ఫిర్యాదుల వెల్లువ

కాకినాడ కలెక్టరేట్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కమిషనర్ కలెక్టరేట్‌లో సమావేశానికి వెళ్లగా అదనపు కమిషనర్ టీకే సుధాకర్ ఫోను ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గంట వ్యవధిలో 14 మంది వివిధ సమస్యలను ఏకరువుపెట్టారు. చెత్త పేరుకుపోతోందని, ఆక్రమణలు తొలగించాలని, దోమలను నియంత్రించాలని, రహదారుల గుంతలు పూడ్చాలని, ఇలా అనేక సమస్యలను విన్నవించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 13 మంది నేరుగా ఆయనకు వినతులు అందించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ ఎస్.మనోహర్, ఎంహెచ్‌వో డి.పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధమతం.. ఆచరణీయం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: బౌద్ధమతం ఆచరణీయమని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు అయితాబత్తుల రామేశ్వరరావు అన్నారు. ఇంద్రపాలెం అంబేడ్కర్ విగ్రహం కూడలిలో సోమవారం 68వ ధమ్మ దీక్ష మహోత్సవాల్లో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధుని బోధనలు, సిద్ధాంతాలు సమాజానికి ఆమోదయోగ్యమన్నారు. దళిత సంఘాల నాయకులు బచ్చల కామేశ్వరరావు, బయ్యా రాజేంద్రకుమార్, ఎం.డేవిడ్, సబ్బతి ఫణేశ్వరరావు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

బౌద్ధం.. విశ్వశాంతి సాధనం



దమ్మ దీక్ష చేస్తున్న బౌద్ధ ఉపాసకులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: బౌద్ధంతోనే విశ్వశాంతి సాధ్యమవుతుందని త్రిరత్న బుద్ధ విహార్ వ్యవస్థాపకులు పి.నరసింహమూర్తి అన్నారు. తాళ్లరేవు అంబేడ్కర్ భవనంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ 68వ దమ్మ దీక్షా దినోత్సవం బీఎస్ఐ మండల అధ్యక్షుడు ఉపాసక పినిపే నాగేంద్ర అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్, గౌతమి బుద్ధుని చిత్ర పటాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఉపాసకులు జక్కల ప్రసాదబాబు, పంతగడ రాంప్రసాద్, పి.సుధీర్, కోరుకొండ నాగేశ్వరరావు బౌద్ధం విశిష్టత క్షేత్రస్థాయిలో ప్రచారం అంశంపై బోధించారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి



సభ్యత్వ నమోదు పత్రమిస్తున్న రామకృష్ణారెడ్డి

జి.మామిడాడ (పెదపూడి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పెదపూడి మండలం జి.మామిడాడలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పక్కన పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు కాకి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆమె అంటే అన్నపూర్ణే..

గ్రామీణ మహిళలు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారు. గతంలో వ్యవసాయ పనులపైనే ఆధారపడే వీరంతా నేడు పట్టణ ప్రాంతాల మహిళలతోసైతం పోటీపడుతున్నారు. మారుమూల పల్లెల్లోని వారు ఉపాధి హామీ పథకం, డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకుంటున్నారు. మరికొందరు రాజకీయ రంగంలో సత్తాచాటుతూ సర్పంచులుగా పల్లెపాలనా పగ్గాలు చేపట్టారు. నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం. 'గ్రామీణ మహిళల వ్యవసాయం.. అందరికీ ఆహారం' అనే నినాదం నేపథ్యంలో పల్లెకు పట్టెడన్నం పెడుతున్న మహిళలపై ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం నియోజకవర్గంలో 52 పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామీణ ప్రాంతాల్లో 2 లక్షల వరకు మహిళలు ఉంటారు. వీరంతా పురుషులతో పోటీపడి రోజంతా శ్రమిస్తుంటారు. మహిళలు డ్వాక్రా యానిమేటర్లు, ఉపాధి హామీ కూలీలు, మేట్లు, ఉద్యాన, వరి పంటల్లో రైతులు, కూలీలుగా, అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎం, మహిళా పోలీసు వంటి రంగాల్లో పనిచేస్తున్నారు. పంచాయతీ సర్పంచులుగా, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులుగా గ్రామీణ మహిళలు పాలన అందిస్తున్నారు. ఉప్పాడ తీరంలో మత్స్యకార మహిళలు చేపల క్రయవిక్రయాలతోపాటు హేచరీల్లోనూ పనిచేస్తుంటారు. మరోపక్క చేనేత రంగంలో వీరి పాత్ర కీలకం. ఆదాయంతో కుటుంబపోషణ, పిల్లల చదువులు సాగుతుండడం విశేషం.

నియోజకవర్గంలో మహిళా రైతులు, కూలీల వివరాలు..

పిఠాపురం	12,000
పెద్దాపురం	8,900
కాకినాడ గ్రామీణం	7,200

50 కుటుంబాలతో పనిచేయిస్తుంటా..

ఉపాధి హామీ పథకంలో మేట్‌గా పని చేస్తున్నా. వారికి మస్టర్ వేయడం, మాకు కేటాయించిన పని ప్రదేశం వద్దకు తీసుకెళ్లి, కొలతల ప్రకారం పని చేయిస్తుంటా. గ్రామీణ మహిళలకు ఉపాధి హామీ పథకంలో మంచి గుర్తింపు ఇచ్చారు. వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే పనిచేసుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉంది.



– గుల్లిపల్లి కృష్ణ వేణి, చిత్రాడ



పిఠాపురం మండలంలో సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న మహిళలు

నాలుగేళ్లుగా పండిస్తున్నా..

నేను నాలుగేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నా. 'గ్రామీణ వ్యవసాయం, అందరికీ ఆహారం' అనే విధానంలో వ్యవసాయంపై దృష్టి సారించా. తద్వారా రసాయన ఎరువులతో సాగుచేసిన పొలం కంటే సేంద్రియ ఎరువులతో సాగుచేసిన పంటకు ధర ఎక్కువగా ఉంటుంది. చుట్టుపక్కల రైతులకు కూడా సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్నా.



– పుప్పల గంగాపార్వతి, మహిళా రైతు, చేబ్రోలు

పల్లె పండగ.. ప్రగతి దండిగా..



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప, రామస్వామి

సామర్లకోట గ్రామీణం, తాళ్లరేవు, పెదపూడి, పిఠాపురం: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. పవరలో సోమవారం పనులు ప్రారంభించారు. చంద్రంపాలెంలోనూ పర్యటించారు. తోట కూర శ్రీనివాస్, తలాటం అచ్యుతరామయ్య, తోట నాగభూషణం పాల్గొన్నారు. ● చొల్లంగి, చొల్లంగిపేట, పటవల, కోరంగి, తాళ్లరేవు, పోలేకుర్రు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే బుచ్చిబాబు అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారని కట్టా త్రిమూర్తులు తెలిపారు. ● పిఠాపురం మండలంలో 'పల్లె పండగ'లో భాగంగా శంకుస్థాపనలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఎంపీడీవో చిన్నారావు తెలిపారు. 84 పనులకుగాను రూ.4.52 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. 15న బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, పి.రాయవరం, పి.తిమ్మాపురం, వెల్దుర్తి, పి.దొంతమూరు, బి.కొత్తూరు గ్రామాల్లో పనులు మొదలవుతాయన్నారు. ● ఎంపీడీవో నరేంద్రరెడ్డి సోమవారం పెదపూడి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. మండలంలో రూ.3.49కోట్లతో సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. 16, 21వ తేదీల్లో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఈవోపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి, ఏఈలు శ్రీనివాసు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా విగ్రహాల నిమజ్జనోత్సవం



పి.రాయవరంలో తరలిస్తున్న భక్తులు

పిఠాపురం, గొల్లప్రోలు: పి.రాయవరంలో దసరా నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం గ్రామంలో నెలకొల్పిన అమ్మవారిని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ● గొల్లప్రోలులో దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగిసిన నేపథ్యంలో నిమజ్జనోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వాహనాలపై కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ఊరేగించి గోదావరి, ఏలేరు కాలువల్లో నిమజ్జనం చేశారు. ఉప్పాడ సముద్ర తీరానికి విగ్రహాలు తరలించారు.

దుర్గమ్మ ఆలయంలో మహాన్నదానం

పెద్దాపురం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ సెంటర్ ప్రాంతంలోని దుర్గమ్మ ఆలయం వద్ద మహాన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పురపాలిక డీఈఈగా బాధ్యతలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పురపాలిక డీఈఈగా ప్రకాశరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ డీఈఈగా పనిచేసిన ఆదినారాయణరావు కాకినాడ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు.

సీపీఎం రూరల్ కార్యదర్శిగా నాగు

పెద్దాపురం: సీపీఎం పెద్దాపురం మండలం రూరల్ ప్రాంతశాఖ కార్యదర్శిగా కేదారి నాగు ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు స్మారక భవనంలో సీపీఎం శాఖ మహాసభ సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ రూరల్ ప్రాంతంలోని ప్రజలు ఇళ్ల స్థలాల సమస్యపై తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు, మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల.. కళ



పనులు పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ, విద్యాశాఖ అధికారులు

గొల్లప్రోలు: మనబడి నాడు-నేడు పథకంలో నిర్మించిన పాఠశాల భవనానికి రంగులు వేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టరు ప్రత్యేకంగా మంజూరు చేసిన రూ.1.50 లక్షల నిధులతో పనులు చేస్తున్నారు. రెండు రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధిలోని నంబరు-2 ప్రాథమిక పాఠశాలకు మనబడి నాడు-నేడు రెండో విడతలో మూడు తరగతి గదులతో భవనం నిర్మించారు. పనులన్నీ పూర్తయినా రంగులు వేయకపోవడంతో ప్రారంభోత్సవం చేపట్టలేదు. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహిస్తున్న జడ్పీ బాలికోన్నత పాఠశాల భవనంలో తరగతులు కొనసాగిస్తున్నారు. రంగులు వేయక వినియోగంలోకి రాని తీరును ఇటీవల గొల్లప్రోలులో పర్యటించిన అధికారులు గుర్తించి కలెక్టరుకు నివేదించారు. వెంటనే నిధులు మంజూరు చేయడంతో పనులు చేపట్టారు. పాఠశాల భవనానికి రంగులువేసే పనులను ఎస్ఎస్ఏ సీఎంవో చామంతి నాగేశ్వరరావు, పెద్దాపురం ఇన్‌ఛార్జి డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 శివప్రసాద్, సిబ్బంది పరిశీలించారు.

ఆదేశం..

దాతల సహకారం మరువలేనిది

కాజులూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాలకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని తహసీల్దారు శివకుమార్ అన్నారు. అన్యం గోవింద జ్ఞాపకార్థం కుమారుడు శ్రీరామచంద్రమూర్తి దంపతులు సుమారు రూ.30 వేల విలువైన శీతల శుద్ధజల యంత్రాన్ని తహసీల్దారు కార్యాలయానికి సోమవారం బహూకరించారు. మండల జనసేన నాయకులు చోడిశెట్టి శ్రీనివాస్, పెంటపాటి పద్దరాజు, గొర్రెల బాలరాజు, నామా విష్ణుచక్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యాలయానికి కంప్యూటర్లు



ప్రారంభోత్సవంలో ఎంపీడీవో, ఎస్ఎస్ఏ సీఎంవో

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండల విద్యాశాఖ కార్యాలయానికి రూ.1.10 లక్షలతో జిల్లా కలెక్టరు అందించిన రెండు కంప్యూటర్లను ఎంపీడీవో స్వప్న, ఎస్ఎస్ఏ సీఎంవో చామంతి నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఇటీవల పవన్‌కల్యాణ్ పీఎస్ మధుసూదన్ పర్యటనలో గొల్లప్రోలులోని మండల విద్యాశాఖ కార్యాలయంలో రెండు కంప్యూటర్లు మరమ్మతులకు గురికావడం, ఒకటి మాత్రమే పనిచేస్తుండడంతో పడుతున్న ఇబ్బందులను గుర్తించి జిల్లా కలెక్టరుకు నివేదించారు. స్పందించిన కలెక్టరు రెండు కంప్యూటర్లు కొనుగోలుచేసి అందజేశారు. ఆయనకు అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. పెద్దాపురం ఇన్‌ఛార్జి డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయం..

విలీన గ్రామాలపై ప్రభుత్వ ప్రకటనకు వినతి

సర్పవరం జంక్షన్(కరప): అటు కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం కాక, ఇటు పల్లెపండగకు దూరమైన 8 గ్రామాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని పౌరసంఘం కన్వీనర్ రమణరాజు ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌ను సోమవారం కోరారు. తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, స్వామినగర్, టీచర్స్‌కాలనీలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనానికి సంబంధించి ప్రభుత్వం గెజిట్ పూర్తిచేసినా.. కార్పొరేషన్ పాలనకు గ్రామ దస్త్రాలు అప్పగించకపోవడం వల్ల రెండేళ్లుగా ఎన్నికలు జరగని దుస్థితి నెలకొందని, దాంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 కోట్లు నిలిచిపోయాయన్నారు. పద్నాలుగేళ్లుగా రూ.140 కోట్ల నిధులు రాలేదన్నారు.



అత్యాచార ఘటనపై కార్మికుల నిరసన

పిఠాపురం: పిఠాపురంలో ఇటీవల ఓ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు కె.చిన్న, సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పిఠాపురం ఉప్పాడ బస్టాండు సెంటర్‌లో బాధిత బాలికకు న్యాయం చేయాలని రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నాగేశ్వరరావు, సత్తిబాబు, వెంకట్రావు, కొల్లు రాజుబాబు, లోవరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

సర్పవరం జంక్షన్(కరప): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని విశ్రాంతి ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు కోరారు. రమణయ్యపేటలో సోమవారం ఆయన అడబాల ట్రస్ట్ ఛైర్మన్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో పలుచోట్ల మొక్కలు నాటారు. చింతపల్లి సుబ్బారావు, ఇందుగల ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి దుర్మరణం

కాజులూరు: ఉప్పుమిల్లి గ్రామంలో సోమవారం పిడుగు పడిన ఘటనలో తాపీమేస్త్రి నందికోళ్ల వీరాస్వామి (35) మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వేకువజామున వర్షం పడుతుండటంతో పశువులను పాకలో కట్టేందుకు పొలం వెళ్లగా ఉదయం ఐదు గంటల ప్రాంతంలో పిడుగుపాటుకు గురయ్యారు. స్థానికులు గమనించి వెంటనే యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమకు దిక్కెవరంటూ వారు విలపిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన వీరాస్వామి ఐదేళ్ల క్రితం ఉప్పుమిల్లి గ్రామానికి వచ్చి జీవనం సాగిస్తున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

సామర్లకోట జడ్పీ బాలికల పాఠశాలలో చోరీ

సామర్లకోట: సామర్లకోట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. దసరా సెలవుల్లో తాళం వేసిఉన్న పాఠశాలలోకి ప్రవేశించిన దుండగులు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. గదులకు ఏర్పాటు చేసిన సుమారు రూ.15 వేల విలువగల విద్యుత్తుకు సంబంధించిన రాగి తీగలు అపహరించుకుపోయారు. దీనిపై హెచ్ఎం మీనామాధురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

కొత్తపల్లి: యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లి పంచాయతీ గొల్లపేటలో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. ఇంటినుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో నిద్రిస్తున్న పక్కుర్తి శివలక్ష్మి కుటుంబ సభ్యులు బయటకు పరుగుతీశారు. నిమిషాల వ్యవధిలో ఇల్లు కాలిబూడిదైంది. సామగ్రి, వస్తువులు, దుస్తులతోపాటు కోళ్లు, మేకలు కూడా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కొత్తపల్లి: అమీనాబాద్ గ్రామానికి చెందిన కుండ్ల రాజు(28) మధ్యవర్తిగా ఉండి మరో వ్యక్తికి అప్పు ఇప్పించాడు. ఆ వ్యక్తి తీర్చకపోవడంతో అప్పు ఇచ్చినవారు ఒత్తిడి చేస్తున్నారు. దాంతో మనస్తాపానికి గురై ఈ నెల 13న విషరసాయనం తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

కళాశాల బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గొల్లప్రోలు: చేబ్రోలు శివారు కూడలిలో ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సును వెనుక నుంచి ఆర్టీసీ బస్సు సోమవారం ఢీకొట్టింది. కూడలిలో మలుపు తిరుగుతున్న చేబ్రోలుకు చెందిన కళాశాల బస్సును అదే మార్గంలో వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కళాశాల బస్సులో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కళాశాల బస్సు వెనుక భాగంలో అద్దాలు పగలడంతోపాటు పక్కన కొంతమేర ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్సై రామకృష్ణ తెలిపారు.



వెనుక భాగం ధ్వంసమైన కళాశాల బస్సు

అల్లుకున్న నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం

విద్యుత్తు స్తంభాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నా సంబంధిత శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కరప మండల విద్యావనరుల కేంద్రం వద్ద, వేళంగి-సిరిగలపల్లి లంక రహదారిలో విద్యుత్తు స్తంభాలకు తీగ మొక్కలు పూర్తిగా కమ్మేశాయి. దీంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయంతోపాటు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని భయాందోళనకు గురవుతున్నారు. వర్షాలు పడినపుడు తీగ మొక్కలకు విద్యుత్తు సరఫరా అవుతోందని, అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీని గురించి ఏఈ ఈశ్వర్‌ప్రసాద్‌ను అడుగగా సిబ్బందితో తొలగింపు చేపడతామన్నారు.





విద్యావనరుల కేంద్రం వద్ద.. వేళంగి-సిరిగలపల్లిలంక దారిలో..

– న్యూస్‌టుడే, కరప

తూరంగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణంలోని తూరంగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. దేవాదాయశాఖ తనిఖీదారు ఫణీంద్ర, ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు, భక్తుల సమక్షంలో లెక్కింపు చేశారు. ఏడు నెలలకు రూ.1,35,076 సమకూరిందని ఈవో తెలిపారు.

కరపలో భారీ వర్షం

కరప: కరప మండల పరిధిలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నడకుదురు, కొరిపల్లి, యండమూరు, గొడ్డటిపాలెం, వలసపాకల తదితర గ్రామాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ సరిలేక వర్షపునీరు రహదారులను ముంచెత్తడంతో కాలనీలు, శివారు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. రహదారులపై నీరు నిలిచి తటాకాలను తలపించడంతో వాహనదారులు, చిరువ్యాపారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భవన నిర్మాణం.. లక్ష్యదూరం



గొల్లప్రోలులో అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ఈ నెల 2న అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవం జరుగుతుందని గత నెలలో అధికారులు ప్రకటించారు. పనులు పూర్తికాకపోవడంతో వినియోగంలోకి రాలేదు. గొల్లప్రోలులో గత తెదేపా ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసేందుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో పనులు పూర్తిస్థాయిలో జరిగే అవకాశంలేదని నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షలు అదనంగా కేటాయించారు. పనులు ప్రారంభించి రెండు నెలలైనా పూర్తికాలేదు. 15 రోజులుగా నిలిచిపోయాయి. బిల్లుల చెల్లింపు జరక్కపోవడంతో పనులు నిలిచిపోయినట్లు పేర్కొంటున్నారు. నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి గుత్తేదారుకు బిల్లుల చెల్లింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని నగర పంచాయతీ ఏఈ ప్రభాకరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ట్రాఫిక్‌కు గంటలపాటు అంతరాయం



వంతెనపై నిలిచిన లారీ

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట-కాకినాడ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఒక లారీ నిలిచిపోయింది. దాంతో కాకినాడ, ద్వారపూడి, రాజమహేంద్రవరం రోడ్లలో వాహనాలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బంది ఎదురైంది. సోమవారం కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఒక లారీ వంతెన ఎక్కే సమయంలో ఇంజిన్‌లో సమస్యతో నిలిచిపోయింది. కెనాల్ రోడ్డులో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. మూడు వైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు రెండు గంటలపాటు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసులు లారీని క్రేన్‌తో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పాదగయలో దేవాదాయశాఖ కమిషనర్ పూజలు



ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. వేద పండితులు క్షేత్ర విశిష్టత వివరించారు. అనంతరం ఆలయంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు, పదోశక్తి పీఠం పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో శ్రీపాద వల్లభుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, ఈవో సౌజన్య పాల్గొన్నారు.

బాల్యం మురిసేలా.. స్థైర్యం నింపేదెలా..?

– న్యూస్‌టుడే, కరప

కౌమార దశలో విద్యార్థుల శారీరక, మానసిక మార్పులు, సమస్యలపై వారిలో అవగాహన ఏర్పర్చి, వారిలో స్థైర్యం నింపేందుకు 2012లో రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమ్(ఆర్‌కేఎస్‌కే)లో భాగంగా ఆరోగ్యకేంద్రాలలో యువక్లినిక్‌ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇవి బోర్డులకే పరిమితమయ్యాయి. 10-19 ఏళ్ల వయసువారికి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కాలానుగుణ వ్యాధులకు చికిత్సల ఒత్తిడిలో వైద్యులకు తీరిక లభించక యువక్లినిక్ సేవలు విద్యార్థులకు అందడం లేదు.

పర్యవేక్షణ లేకపోవడంతో..

తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం, విచ్చలవిడి స్వేచ్ఛ, స్మార్ట్‌ఫోన్ల వినియోగం, సినిమాల ప్రభావం చిన్నారులు, యువత ప్రవర్తనపై ప్రభావం చూపిస్తున్నాయి. ఎక్కువ సమయం పాఠశాలలు, కళాశాలల్లో గడపడంతో త్వరగా అలసిపోవడం, పని చేయలేకపోవడం, ఆత్మస్థైర్యం కోల్పోవడం తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ఊబకాయం భయంతో తక్కువగా తినడంతో శారీరక పెరుగుదల ఆగిపోయి యవ్వనదశ ఆలస్యం కావడం, రక్తహీనతకు గురికావడం జరుగుతుంటాయి. గ్రామీణ యువతుల్లో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, బాల్య వివాహాలతో మాతాశిశు మరణాలు పెరిగిపోతున్నాయి. మరికొందరు చెడు స్నేహాల కారణంగా వ్యసనాల బారిన పడుతుంటారు. ఈ నేపథ్యంలో మానసిక వైద్యుల సహాయం అవసరం. ఇలాంటి సేవలు అందించేందుకు నిర్ణయించిన మంచి పథకాన్ని సరిగా అమలు చేయాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.



కరప పీహెచ్‌సీలో యువక్లినిక్-కౌమార స్వాస్థ్య కేంద్రం

ఆర్బీఎస్‌కే ద్వారా అవగాహన

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా పాఠశాలల్లోని 10-19 ఏళ్ల వయసువారికి ఆరోగ్య సేవలు, కౌమార దశ లక్షణాలు-మార్పులు, మానసిక ఒత్తిడిని జయించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పీహెచ్‌సీకి వచ్చే యువత వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాం. కౌమార దశలో యువత ఎదుర్కొనే అనేక సమస్యల పరిష్కారానికి ఆర్బీఎస్‌కే వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు.

– డా.క్రాంతిసౌజన్య, వైద్యాధికారిణి, వేళంగి పీహెచ్‌సీ

తుని
• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

డయల్ యువర్ డీఎం రేపు

ఏలేశ్వరం: ప్రయాణికుల సురక్షితంగా గమ్యానికి చేరవేసే ఆర్టీసీ బస్సుల్లో ఉత్తమమని డిపో మేనేజర్ జి.వి.సత్యనారాయణ అన్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికుల నుంచి సూచనలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈనెల 16న ఉదయం 11గంటల నుంచి 12గం.వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులు 99592 25532 నంబరుకు సంప్రదించాలని కోరారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

తుని పట్టణం: పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం ఉదయం ధ్వజారోహణ, స్వప్నారణ ములు జరిగాయి. భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించారు.

స్థల సేకరణకు చర్యలు

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని తాండవ నది ఒడ్డున ఉప్పరిగూడెం రోడ్డులో సుమారు 3.50 ఎకరాల భూసేకరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తహసీల్దారు ప్రసాద్, పురపాలక ఏఈ ప్రసన్న లక్ష్మి తదితరులు స్థలాన్ని సోమవారం పరిశీలించారు. పురపాలక సంఘం ద్వారా మురుగు నీటి శుద్ధి ప్లాంటును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఏఈ తెలిపారు. ఈ ప్లాంట్ నిర్మాణమైతే పుర వీధుల్లో రోజు వారీ ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిని శుద్ధి చేశాక తాండవలోకి విడిచిపెడతారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఇతర అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

డ్రైనేజీలో పైపులైన్లు తొలగించాలి

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని గొల్లలగుంటలో మంచినీటి పైపు లైన్లు డ్రైనేజీలో ఉన్నాయి. లీకులు ఏర్పడినప్పుడు నీరు కలుషితమవుతుందని స్థానికులు వాపోతున్నారు. మురికికాలువలో ఉన్న పైపులైన్లను సరి చేసి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెత్త కుండీ ఏర్పాటు

శంఖవరం: కత్తిపూడి 4వ వార్డులో చెత్త సేకరణ చేపట్టక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. సమస్యను కార్యదర్శి వీరబాబు వద్ద ప్రస్తావించగా చెత్త వేసేందుకు కుండీ ఏర్పాటు చేశారు.

వ్యర్థాలు తొలగింపు



తొండంగి: మండలంలోని గోపాలపట్నం పలు వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తెచ్చారు. పంచాయతీ కార్యదర్శి రాము దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు తొలగించే పనులు ప్రారంభించారు.

స్పందనకు వందనం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

రూ.లక్షల విక్రయాలు.. సదుపాయాలు మృగ్యం

రోజూ ఇక్కడ రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. మెట్ట ప్రాంతంలో ఎక్కడ అరటి తోటలు ఉన్నా గెలలు వచ్చిపడతాయి. మండలంలోని యర్రవరంలో పెద్ద మొత్తంలో అరటి గెలల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. రైతులు ఆటోలు, ద్విచక్రవాహనాలు, వాహనాల్లో గెలలను ఇక్కడకు తెచ్చి వ్యాపారులకు అమ్ముతుంటారు. రోజూ రూ.మూడు లక్షల వరకు ఇక్కడ వ్యాపారం జరుగుతుంది. ఇటు రైతులకు, అటు వ్యాపారులకు, గెలల కోసం వచ్చేవారికి ఏవిధమైన కనీస సౌకర్యాలు ఉండవు. మార్కెట్‌కి వెళ్తే దారి దుస్థితి ఇందుకు నిదర్శనం.

– న్యూస్‌టుడే, ఏలేశ్వరం

చిత్తడిలో అడుగేయాల్సిందే..

యర్రవరం మార్కెట్‌కి రోజూ పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల నుంచి రైతులు దేశవాళీ, అమృతపాణి తదితర రకాల అరటి గెలలను తెస్తారు. మార్కెట్‌కి వెళ్లాలంటే బురదలో అడుగు వేయాల్సిందే. నడిచి వచ్చే ప్రజలు జారి పడుతున్నారు. వాహనాలు దిగబడుతున్నాయి. అరటి గెలలను కొనుగోలు చేసేందుకు వచ్చే వారికి ప్రయాసే. గెలలను ఉంచేందుకు అనువైన ప్రదేశమే కరవైంది. ఇక్కడ మార్కెట్‌లో గెలలను తీసుకొచ్చే వారు బేరం కుదిరేంతవరకు వేచి ఉండేందుకు అవసరమైన వసతి లేకపోవడంతో ఇబ్బందులు షరామామూలే. ఎండ, వాన నుంచి రక్షణ ఉండడం లేదని పలువురు వాపోతున్నారు. చెట్టు నీడే శరణ్యమని వారు అంటున్నారు. వర్షం వస్తే మార్కెట్ నీటితో నిండుతుంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌కి వచ్చి వెళ్లాలంటే ఇక్కట్లు తప్పడంలేదు. ప్రభుత్వం స్పందించి మార్కెట్‌లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

యర్రవరం అరటి మార్కెట్


వర్షం వస్తే దుస్థితి ఇదీ

సమస్యల పరిష్కారానికి చర్యలు..

యర్రవరం మార్కెట్లో నెలకొన్న సమస్యలను సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళతాం. రైతులకు ఏవిధమైన ఇబ్బందులు రానీయం. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- కేవీ సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ

యనమల సమక్షంలో తెదేపాలో చేరిక

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైకాపా నుంచి తెదేపాలో చేరుతున్నట్లు తిమ్మాపురం గ్రామానికి చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు తెలిపారు. గ్రామానికి చెందిన తెదేపా నాయకుల కాపారపు అబ్బు, అత్తి అచ్చారావు, పోల్నాటి కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో సోమవారం తేటగుంట పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి యనమల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.


తెదేపాలోకి చేరిన తిమ్మాపురం వైకాపా నాయకులు, కార్యకర్తలు

పేదోడి కడుపు నింపడమే తెదేపా నినాదం

గండేపల్లి(జగ్గంపేట): ప్రతి పేదవాడి కడుపు నింపాలని అదే నిజమైన పాలన అని స్వర్గీయ నందమూరి తారకరామారావు అన్నారని తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం జగ్గంపేట సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటీన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా ప్రతీ సోమవారం ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్నామని దీనికి సహకరిస్తున్న నెహ్రూ అభిమానులకు, కూటమి కుటుంబసభ్యులకు అబినందనలని అన్నారు. పరిమి వీర్రాజు, అన్నపూర్ణ దంపతులు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్‌లో కోర్పు లచ్చయ్యదొర, పరిమి బాబు, జీను మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

18న నెహ్రూ పుట్టినరోజు వేడుకలు

గండేపల్లి(జగ్గంపేట): ఈ నెల 18న జగ్గంపేట తెదేపా పార్టీ ఆఫీస్‌వద్ద జరిగే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు అభిమానుల మధ్య ఘనంగా జరగనున్నాయని తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం జగ్గంపేట తెదేపా కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో నవీన్‌కుమార్ సమావేశం నిర్వహించారు.

షాట్‌పుట్‌లో బంగారు పతకం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి సాంబశివరావు షాట్‌పుట్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపల్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 4,5,6 తేదీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో షాట్‌పుట్‌లో విద్యార్థి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు..

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా సోమవారం తెల్లవారుజాము నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అల్పపీడనం కారణంగా అద్దరిపేట నుంచి చోడపల్లిపేట వరకు ఉన్న సముద్ర తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. తుపాను కారణంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ల కూడదని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు సూచించారు.

‘ఉద్యోగులతో కక్షపూరిత ధోరణి వద్దు’

గండేపల్లి: గతపాలనలో పాలకులు ఉద్యోగస్తులను వేధించడం వల్లనే కనుమరుగయ్యారని జిల్లా మిడ్‌డే మీల్స్ కార్యదర్శి ఎన్.ఈశ్వరీ అన్నారు. సోమవారం గండేపల్లి మండలం సింగరంపాలెం గ్రామంలోని పాఠశాలలో మిడ్‌డే మీల్స్ ఆయాలను తొలగించడంపై సింగరంపాలెం గ్రామ నాయకులను కలిసేందుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ.. ఏవిధమైన సమాచారం లేకుండా కక్ష పూరితంగా గ్రామంలోని నొక్కు నూకరత్నం, రాండి నాగమణిలను తొలగించారంటూ గత ప్రభుత్వంలో చేసిన తప్పులే మీరు చేస్తే తేడా ఏముంటుందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగ్గంపేట గ్రామీణం: మల్లిసాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08లో ‘పది’ చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో జరిగింది. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు తాతారావు, సుబ్బయ్య, కనకవల్లి, చక్రధర్, సతీష్, అచ్యుత్‌లు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు ఉన్నతస్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. తొట్టిపూడి రాజా, మిరియాల బద్రి, సురేష్‌కుమార్, రాజశేఖర్, శ్రీధర్, శివ, సత్తిబాబు, అంబిక, దేవి, తదితరులు పాల్గొన్నారు.


మల్లిసాల హైస్కూల్‌లో 2007-08 విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

తుని, న్యూస్‌టుడే: గ్యారవీ షరీఫ్ పర్వదినం సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని హజరత్ మహబూబ్ సుభానీ వారి దర్గా జెండా నిషానీ వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో ముస్లిమ్‌లు ఖురాన్ పఠనం చేసి అంతా బాగుండాలని అల్లాహ్, ఆయన ప్రవక్త మొహమ్మద్‌లను వేడుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో సహపంక్తి భోజనాల్లో ప్రసాదం స్వీకరించారు. రాత్రి పట్టణంలోని మెయిన్‌రోడ్డు పెద్ద మసీదులో నమాజ్‌ప్రార్థనలు చేశారు. ఇమామ్ కబీరుద్దీన్ ఇస్లామ్ మత ధర్మాలు, ఇతర అంశాలు వివరించి సత్‌ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రౌతులపూడి: వైకాపా ప్రభుత్వం పల్లెల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని బలరాంపురం గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, సర్పంచులను కేవలం ఉత్సవ విగ్రహాలుగా ఉంచారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రహదారులు, పశువుల షెడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. దిగువశివాడ, గంగవరం, బలరాంపురం గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.


వెలమకొత్తూరు భూమిపూజ కార్యక్రమంలో అధికారులు

తొలిరోజు రూ.40 లక్షల పనులకు శ్రీకారం

తుని గ్రామీణం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ మొదటి రోజు కార్యక్రమంలో తుని మండలంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. వెలమకొత్తూరులో రూ.25 లక్షలు, రాజుపేటలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డుకు మండల పరిషత్తు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు.

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి గ్రామాల్లో పల్లె పండుగ సోమవారం జరిగింది. ఎమ్మెల్యే సత్యప్రభ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సర్పంచులు తటవర్తి సుబ్బారావు, రొంగల సత్యనారాయణ, ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో కుమార్‌బాబు పాల్గొన్నారు.

తొండంగి: ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండుగ వారోత్సవాలు తొండంగి మండలంలో మంగళవారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.రాజేశ్వరరావు తెలిపారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే యనమల దివ్య శంకుస్థాపన చేస్తారన్నారు. 15న పైడికొండ, కృష్ణాపురం, 16న శృంగవృక్షం, పాతచోడిపల్లిపేట, 18న ఒంటిమామిడి, బెండపూడి 19న జీఎంపేట, వేమవరం, 20 న కోదాడ, ఏవీనగరం, 21న పీఈచిన్నాయిపాలెం, రావికంపాడు గ్రామాల్లో జరుగుతాయన్నారు.


బలరాంపురంలో భూమిపూజలో ఎమ్మెల్యే, నాయకులు

గండేపల్లి: ఈ నెల 16,17 తేదీల్లో పంచాయతీల్లో జరిగే పల్లె పండుగ కార్యక్రమాలను పండుగలా నిర్వహించాలని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులకు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఏవో చంద్రరావు, ఏపీవో గంగాభవాని, ఈసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెదనం పదిలం!





బెట్టు కింద చావిట్లో ఊసులాడుకుంటూ బుట్టలు అల్లే పనిలో నిమగ్నమైన ఈ దృశ్యం ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలోనిది. అట్లతద్దె సమీపిస్తుండంతో ఇలా జాజాలు (బుట్టలు) అల్లుతున్నారు. తద్దెకు ఆచరించే నోముల్లో నవధాన్యాలను మొలకెత్తించిన ఈ బుట్టలు వినియోగిస్తారు. ఇంటింటా జరిగే అట్లతద్దె కోసం గ్రామాల్లో వీటిని పర్వదినానికి వారం ముందే సిద్ధం చేశారు. ఆధునికత చుట్టేసినా, సాంకేతికతకు సమాంతరంగా నడుస్తున్నా ఇలాంటి ముచ్చట్లు పల్లెదనాన్ని పదిలంగా ఉంచుతున్నాయి.

– న్యూస్‌టుడే–ప్రత్తిపాడు

గతం ఘనం.. వర్తమానంలో వైద్యం హుళక్కేనా..?



తొండంగి మండలం పెరుమాళ్లపురం హోమియో వైద్యశాల రెండు దశాబ్దాలుగా పరిసర గ్రామాల ప్రజలకు ఉత్తమ సేవలు అందించింది. కానీ రెండేళ్లుగా పూర్తిస్థాయి వైద్యాధికారి లేకపోవడంతో రోగులకు ఇబ్బందిగా ఉంది. ఇక్కడ విధులు నిర్వహించే వైద్యాధికారి వేరే ప్రాంతానికి బదిలీ అవడంతో సేవలు నిలిచాయి. గతేడాది కోటనందూరు మండలం అల్లిపూడి హోమియో వైద్యాధికారిని ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా నియమించారు. ఆయన వారంలో మూడు రోజుల పాటు సేవలు అందించేవారు. ఆయన కూడా గతేడాది జూన్‌లో విశాఖపట్టణం బదిలీ అవడంతో పెరుమాళ్లపురం హోమియో ఆస్పత్రి నిరుపయోగంగా ఉంటోంది. ప్రజాప్రతినిధులు, ఆయుష్ విభాగం అధికారులు స్పందించి హోమియో వైద్యాధికారిని నియమించాలని మండలవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తొండంగి

కుంగుతున్న రోడ్డు



రాజుపాలెం నుంచి ముక్కొల్లు వెళ్లే రోడ్డులో వాలుకాలువ వంతెన అప్రోచ్ వద్ద పడ్డ గండివల్ల రోడ్డు కోతకు గురవుతుంది. ముక్కొల్లు గ్రామం వైపు అప్రోచ్ మలుపు తిరిగే ప్రదేశంలో రోడ్డు కాలువ వైపు కుంగుతుంది. దీంతో భారీ వాహన దారులు రాకపోకలు సాగించేందుకు ఆందోళన చెందుతున్నారు. ప్రయాణికులతో వెళ్లే ఆటోలు రాత్రి సమయాల్లో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు స్పందించి వంతెన వద్ద అత్యవసరంగా రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, వాహనచోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కిర్లంపూడి

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కిర్లంపూడి: రమణయ్యపేటకు చెందిన నక్కరాజు రమణ(52) గడ్డిమందు తాగి చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ టి.అప్పారావు తెలిపారు. వివరాలివీ..రమణయ్యపేటకు చెందిన నక్కరాజు రమణ కూలి పనిచేస్తూ భార్య, కుమారుడు, కుమార్తెతో జీవిస్తున్నారు. ఏడాది కిందట సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నారు. ఇంటి నిర్మాణానికి సుమారు రూ.5లక్షలు అప్పుచేశారు. అప్పుతీర్చే పరిస్థితి లేదనే మనస్థాపంతో ఈనెల 13న ఇంటి వద్ద గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అత్యవసర చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు వీరవెంకటర దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై హెచ్‌సీ అప్పారావు కేసు నమోదుచేశారు. ఎస్సై జి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గండేపల్లి: ఎన్‌హెచ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాలివీ.. ధవళేశ్వరానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్రవాహనంపై పిఠాపురం ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా తాళ్లూరు దాబాల సెంటర్‌కు వచ్చేసరికి అదే సమయంలో ఉప్పలపాడు రోడ్డు వైపు స్కూటీపై రోడ్డు దాటుతున్న వ్యక్తి వీరి వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో దంపతులకు గాయాలవ్వడంతో వీరిని జగ్గంపేట సీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తరలించినట్లు తెలిపారు.

కళాశాల బస్సు ఢీకొని చోదకుడికి..

తుని పట్టణం: పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో ఉన్న మీసేవా కేంద్రం సమీపంలో ఓ ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు అయ్యాయని హెడ్‌కానిస్టేబుల్ సూరిబాబు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలానికి చెందిన పి.మంగరాజు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కళాశాల బస్సు ఢీ కొట్టిందన్నారు. దీంతో గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

34 కేజీల గంజాయితో వ్యక్తి అరెస్ట్

శంఖవరం: గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు సోమవారం తెలిపారు. వివరాలివీ.. చెన్నై కవిభారతి నగర్‌కు చెందిన పుగాజ్ హేంది(23) రాయవరం శివారు ఏలేరు కాలువ వద్ద 34 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వ్యసనాలకు బానిసై గంజాయి తాగుతూ మిగిలిన గంజాయిని విక్రయిస్తూ తిరుగుతున్నాడన్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ1.79 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

అన్నవరం: అన్నవరం ఎన్‌హెచ్‌పై సోమవారం ఉదయం ప్రమాదం జరిగింది. నమూనాలయం సమీపంలో ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. తణుకు నుంచి భువనేశ్వర్ గుడ్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ముందు లారీని ఢీ కొనడంతో ముందుభాగం నుజ్జునుజ్జైంది. డ్రైవర్, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో వీరిని తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఇద్దరి అరెస్టు

జగ్గంపేట గ్రామీణం: కాట్రావులపల్లిలో కోడిపందేలు ఆడుతున్న శిబిరంపై అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి ఇద్దరు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామశివారున కొందరు పందెంరాయుళ్లు చేరి జూదాలకు పాల్పడుతున్నారని కోడిపందేలు ఆడుతున్న వారి నుంచి రెండు పుంజులు, రెండు కోడికత్తులు, రూ.1050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

ఎన్.ఎన్.పట్నంలో సారా కాస్తూ మరో ఇద్దరు..

రౌతులపూడి: ఎన్.ఎన్.పట్నంలో ఇద్దరిని రౌతులపూడి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివీ.. ఎన్.ఎన్.పట్నం గ్రామ శివారున సారా కాస్తున్న సీహెచ్‌శ్రీను, వై.అప్పారావులను అరెస్టు చేశారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వారి నుంచి సారా తయారీ పరికరాలు, 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సామాజిక సాధికారతగా.

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: సామాజిక సాధికారతలో భాగంగా దివ్యాంగులకు ఉపకరణాలను సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 209 మందికి వీటిని అందజేయనున్నారు. మూడు చక్రాల సైకిళ్లతో సహా 321 ఉపకరణాలు ప్రత్తిపాడు మండల పరిషత్‌కు వచ్చాయి. ఛార్జింగ్‌తో నడిచే ఎలక్ట్రిక్ సైకిళ్లు సరఫరా చేశారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత విభాగంలో భాగంగా ఆర్టిఫీషియల్ లింబ్స్ మ్యాన్యుఫాక్చురింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఏఐఎల్ఎంసీవో) ద్వారా వీటిని అందజేస్తున్నారని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. ఆగస్టు 3న జగ్గంపేటల నిర్వహించిన శిబిరంలో గుర్తించిన వారికి ఈ ఉపకరణాలు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే సత్యప్రభ ప్రత్తిపాడులో మంగళవారం వీటిని అందజేయనున్నారు.


పంపిణీకి సిద్ధంగా ఉన్న మూడుచక్రాల సైకిళ్లు

పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

శంఖవరం: శంఖవరం గ్రామానికి చెందిన గాది కొండబాబు అదే గ్రామానికి చెందిన పేద విద్యార్థికి చదువు నిమిత్తం సోమవారం రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఏటా పలువురికి ఆర్థిక సహాయం, సేవా కార్యక్రమాలు చేస్తున్న కొండబాబును గ్రామస్థులు, మిత్రులు ఆయన్ను అభినందించారు.

దమ్మదీక్ష ప్రవర్తన దినోత్సవం

గండేపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత పాలకులు అశోకుని పాలనవిధానాన్ని అనుసరించాలని, స్వార్థాన్ని విడనాడి ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడాలని దమ్మప్రబోధకుడు అరియ నాగసేన బోధి అన్నారు. సోమవారం నీలాద్రిరావుపేట గ్రామంలోని వాసుదేవ నగర్‌లో బుద్ధుని ప్రతిమ వద్ద అశోక విజయ దశమి, దమ్మ చక్రప్రవర్తన దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌పిఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్, బిఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సీలింగ్ భూములు పేదలకు పంచాలి

ఏలేశ్వరం: భూస్వాముల చేతుల్లో ఉన్న సీలింగ్ భూములను పేదలకు పంచాలని వినోద్‌మిశ్రా పార్టీ నాయకులు కొసిరెడ్డి గణేశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏలేశ్వరం, తిరుమాలి, జె.అన్నవరం గ్రామాల్లో భూదాన భూమిని బినామీపేర్లు చూపి భూస్వాములే అనుభవిస్తున్నారన్నారు. మహిళా కార్యకర్తలు సోమ లవకుశల, రాజారావు, కందుల క్రాంతికుమార్, దొమ్మేటి లక్ష్మి పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న వినోద్‌మిశ్రా పార్టీ నాయకులు

హక్కుల నేత సాయిబాబాకు నివాళి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: హక్కులనేత ప్రొ.సాయిబాబా హఠా న్మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని ఉభయ గోదావరి జిల్లాల క్వారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కుప్పుల నాగభూషణం అన్నారు. ఏలేశ్వరంలోని క్వారీ కార్మిక భవనంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి బత్తుల రాజబాబు, నీలపల్లి సుబ్బారావు, ఉపాధ్యక్షులు రాజు, నలమాటి పండు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న క్వారీ యూనియన్ నాయకులు

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రత్తిపాడులో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన, ధర్నా జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, తక్షణమే వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, వాలంటీర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జాకబ్, సతీష్‌కుమార్ తదితరులు నాయకత్వం వహించారు. వాలంటీర్ల సమస్యలపై అక్టోబరు 28న కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు కార్యాలయంలో అందజేశారు.


ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వాలంటీర్లు, సీఐటీయూ నాయకులు

నీటి ట్యాంకులు పదిలమా..?

లీకులతో నాచుపట్టి శిథిలమవుతున్న నిర్మాణాలు ✦ మొక్కలు పెరిగి పెచ్చులూడుతున్న భాగాలు

న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం:

గ్రామాల్లో తాగునీటిని అందించే ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్వహణ కొరవడి శిథిలమవుతున్నాయి. వీటిని నిర్మించి దశాబ్దాలు కావస్తుండడంతో పెచ్చులూడి ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. ట్యాంకు పిల్లర్లు, పైభాగంలో పెచ్చులూడి నీరు లీకవుతూ నాచుపట్టి చిత్తడిగా మారుతున్నాయి. నీటిని నింపే సమయంలో ట్యాంకులు నిండిన తర్వాత కిందికి వృధాగా పోయే నీటితో ట్యాంకులు నిత్యం నానుతున్నాయి. ప్రతి 15 రోజులకు ఒకసారి జలభాండాగారాలను శుభ్రంచేసి క్లోరిన్ వేయాల్సి వుండగా ట్యాంకులు శిథిలం కావడంతో నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

రాజపూడి సచివాలయం సమీపంలోని ఓవర్‌హెడ్ ట్యాంకుపై భాగంలో మొక్కలు మొలిచినా తొలగించకపోవడంతో అవి పెద్దవిగా ఎదుగుతున్నాయి. దీంతో ట్యాంకు పెచ్చులూడి నీరు లీకవుతోంది. పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

✦ సీతారాంపురంలోని ట్యాంకుపై భాగంలో శుభ్రం చేసేందుకు అమర్చిన రెయిలింగ్ పాడై శిథిల స్థితికి చేరాయి. ఈ మెట్లు ఎక్కేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఏ సమయంలో కూలితాయో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. ✦ కాట్రావులపల్లి, కాండ్రేగుల, జె.కొత్తూరు గ్రామాల్లోని ట్యాంకుల కింది భాగంలో మొక్కలు పెరిగిపోయాయి. ✦ మామిడాడలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఉన్న తాగునీటి ట్యాంకు పెచ్చులూడి శిథిలమవుతోంది. ట్యాంకు పైభాగం నుంచి శిథిలాలు తరచుగా పడుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించడంతో ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నారు.


రాజపూడిలో లీకులతో నాచుపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు

మరమ్మతులు చేపడుతున్నాం..

పలు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులకు లీకులు ఏర్పడడంతో మరమ్మతులు చేపడుతున్నాం. గ్రామాల్లో అదనంగా నిర్మించిన ట్యాంకులకు నీటిని ఎక్కించి సరఫరా చేస్తున్నాం. లీకులు, పెచ్చులూడుతున్న ట్యాంకులకు నిధులు కేటాయించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తాం.

- ఎం.రాంజీరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, జగ్గంపేట